మహబూబ్‌నగర్

వార్త
నాగర్‌కర్నూల్ / వనపర్తి / జోగులాంబ గద్వాల / నారాయణపేట

## దరఖాస్తుల పరిష్కారానికి

# ప్రత్యేక చొరవ చూపాలి..

**నారాయణపేట జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్**



అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ సిక్తా పట్నాయక్

**నారాయణపేట టౌన్,అక్టోబరు 24 ప్రభాతవార్త :** ఎల్ఆర్ఎస్ దరఖాస్తుల పరిష్కారానికి లెవల్ 1, లెవల్ 2 స్థాయిలో సంబంధిత అధికారులు, సిబ్బంది ప్రత్యేక చొరవ చూపాలని జిల్లా కలెక్టర్ సిక్తాపట్నాయక్ సూచించారు. దరఖాస్తుల పరిష్కారంలో ప్రభుత్వ నిబంధనలను తప్పనిసరిగా అనుసరించాల్సిందేనని అన్నారు. గురువారం జిల్లాలోని మద్దూరు మండలం రెనివట్ల, కోస్గి పట్టణం కడంపల్లి శివార్లలో ఎల్ఆర్ఎస్ దరఖాస్తుల పరిష్కార ప్రక్రియను కలెక్టర్ పరిశీలించారు. లెవల్ 1 స్థాయిలో నీటి పారుదల శాఖ, రెవెన్యూ, పంచాయతీ కార్యదర్శులు క్షేత్రస్థాయికి వెళ్లి ఎల్ఆర్ఎస్ దరఖాస్తుల పరిష్కారానికి సమన్వయంతో పని చేయాలన్నారు. బఫర్ జోన్ కింద ఉంటే ఆ జోన్‌కు 30 మీటర్ల దూరంలో ఉన్న ప్లాట్లను రెగ్యులర్ చేయాలని, బఫర్ జోన్ పరిధిలోనే ఉన్న ప్లాట్లను మాత్రం తిరస్కరించాలని కలెక్టర్ ఆదేశించారు. ఇక లెవల్ 2 స్థాయిలో ఎంపిఓలు, ఎంపిడిఓలు అన్ని నిబంధనలను అనుసరిస్తూ ఎల్ఆర్ఎస్ ప్రక్రియను ముందుకు తీసుకువెళ్లాలని ఆమె తెలిపారు. మద్దూరు మండలం రెనివట్లలో 407, కోస్గి సమీపంలోని కడెంపల్లి శివారులో 57 పెండింగ్ ఎల్ఆర్ఎస్ దరఖాస్తుల పరిష్కారంపై ఆమె సంబంధిత అధికారులకు తగిన సలహాలు, సూచనలు ఇచ్చారు. వీలైనంత త్వరగా ఆయా దరఖాస్తులను పరిష్కరించాలని ఆదేశించారు. అలాగే మద్దూరు, కోస్గి మండలాల పరిదిలో ఎన్ని మరుగుదొడ్ల నిర్మాణాలు చేపట్టాల్సి ఉందని ఎంపిడిఓలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో మద్దూరు, కోస్గి తహసిల్దార్‌లు మహేష్‌గౌడ్, బక్క శ్రీనివాస్, ఎంపిడిఓలు మహేష్‌గౌడ్, బక్క శ్రీనివాస్, ఎంపిడిఓలు నరసింహారెడ్డి, శ్రీధర్, ఆర్ఐ జనార్ధన్, నీటి పారుదల శాఖ ఏఈలు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

## చిన్న పిల్లల గుండె వ్యాధుల

# ఉచిత వైద్య శిబిరం

**అదనపు కలెక్టర్ లోకల్ బాడీస్ సంచిత్ గంగ్వార్**



**వనపర్తి టౌన్ అక్టోబరు 24 ప్రభాతవార్త :** వనపర్తి పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో చిన్న పిల్లల గుండె సమస్యలు ఉన్న చిన్న పిల్లల కోసం అక్టోబరు 26న జిల్లా కేంద్రంలో నిర్వహించే ఉచిత వైద్య శిబిరాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని అదనపు కలెక్టర్ లోకల్ బాడీస్ సంచిత్ గంగ్వార్ నేడొక ప్రకటనలో తెలిపారు. ఎస్.ఎం.డి.సీ లిమిటెడ్ వారి సౌజన్యంతో హృదయ ఫౌండేషన్ , హైదారాబాద్ వారి ఆధ్వర్యంలో శనివారం ఉదయం 10 గంటల నుండి మధ్యాహ్నం 3 గంటల వరకు జిల్లా కేంద్రంలోని టీచర్స్ కాలనీ పట్టణ పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఈ ఉచిత వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. వైద్య శిబిరంలో పిడియాట్రిక్ కార్డియాలజీ స్పెషలిస్ట్ లు అందుబాటులో ఉంటారని, 2డి ఎకో సేవలు సైతం పొందవచ్చని తెలిపారు. శిబిరానికి వచ్చే వారు పాత రిపోర్టులతో పాటు, తెల్ల రేషన్ కార్డు, ఆరోగ్య శ్రీ కార్డు విధిగా తెచ్చుకోవాలని సూచించారు. పూర్తి వివరాలకు 9154289381 నెంబర్‌ను సంప్రదించవచ్చని సూచించారు.

## పోలీస్ అధికారులు, సిబ్బంది

# అంకితభావంతో పనిచేయాలి

**జోగులాంబ జోన్ 7, డిఐజి ఎల్ఎస్ చౌహాన్**



మొక్క నాటుతున్న డిఐజి ఎల్ఎస్ చౌహాన్

**నారాయణపేట టౌన్,అక్టోబరు 24 ప్రభాతవార్త :** ప్రజలతో మమేకమై పోలీస్ అధికారులు సిబ్బంది అంకితభావంతో పని చేయాలని, నేరాల నియంత్రణపై దృష్టి సారించాలని, ప్రతి కేసులో పారదర్శకంగా ఇన్వెస్టిగేషన్ చేసి బాధితులకు న్యాయం అందించాలని పోలీస్ స్టేషన్‌కు వచ్చే బాధితులకు సత్వరం న్యాయం అందించాలని, ప్రజల భద్రతకు భరోసా కల్పించాలని జోగులాంబ జోన్ 7 డిఐజి, ఎల్ఎస్ చౌహాన్ ఐపిఎస్ తెలిపారు. వార్షికతనిఖీల్లో భాగంగా గురువారం జోగులాంబ జోన్ డిఐజి ఎల్ఎస్ చౌహాన్ జిల్లాలోని మరికల్ సర్కిల్ కార్యాలయాన్ని, ధన్వాడ పోలీస్ స్టేషన్‌ను, నారాయణపేట పోలీస్ స్టేషన్ కార్యాలయాన్ని జిల్లా ఎస్పీతో కలిసి సందర్శించి ఆయా పోలీస్ స్టేషన్‌ల రికార్డులను, పరిసరాలను పోలీస్ స్టేషన్‌లో సిబ్బంది నిర్వహిస్తున్న విధులను, జిల్లా పోలీస్ కార్యాలయంలో ఆయా సెక్షన్ అధికారుల రికార్డులను తనిఖీ చేశారు. అందులో భాగంగా ముందుగా మరికల్ సర్కిల్ కార్యాలయాన్ని పరిశీలించి పోలీసుల గౌరవ వందనం స్వీకరించారు. అనంతరం సర్కిల్ కార్యాలయానికి సంబంధించిన సర్కిల్ ఇన్ఫర్మేషన్ బుక్, క్రైం డైజెస్టర్ రికార్డు, ప్రభుత్వ ప్రాపర్టీ రిజిస్టర్, పిటిషన్ రిజిస్టర్‌లను పరిశీలించారు. కార్యక్రమంలో అదనపు ఎస్పీ ఎండి రియాజ్, సిఐలు రిజేందర్‌రెడ్డి, శివశంకర్, చంద్రశేఖర్, రామ్‌లాల్, ఆర్ఐ నరసింహా, ఎస్సైలు మురళి, రమేష్, వెంకటేశ్వర్లు, కృష్ణంరాజు, సునిత, జిల్లా పోలీస్ కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

## అసెంబ్లీని సందర్శించిన

# జర్మనీ పార్లమెంట్ సభ్యులు

**స్పీకర్‌తో కలిసి స్వాగతం పలికిన ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి**

**మహబూబ్‌నగర్,అక్టోబరు24 ప్రభాతవార్త:**జర్మనీ స్టేట్‌పార్లమెంట్ సభ్యులు తెలంగాణ అసెంబ్లీని గురువారం సందర్శించారు. ఈసందర్భంగా వారికి అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్, మండలి ఛైర్మన్ సుఖేందర్‌రెడ్డితో కలిసి మహబూబ్‌నగర్ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి స్వాగతం – మిగతా2లో..



జర్మనీ సభ్యులకు స్వాగతం పలుకుతున్న ఎమ్మెల్యే యెన్నం, చిత్రంలో స్పీకర్ గడ్డం ప్రసాద్

## కలెక్టర్‌ను కలిసిన పియు వీసీ

**మహబూబ్‌నగర్,అక్టోబరు 24 ప్రభాతవార్త :** పాలమూరు యూనివర్సిటీ ఉపకులపతి ఆచార్య శ్రీనివాస్ జిల్లా కలెక్టర్ విజయేంద్రి బోయిని మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా విసి కలెక్టర్‌తో మాట్లాడుతూ యూనివర్సిటీలో జరిగే పలు అభివృద్ధి పనులు వివరిస్తూ, అదనపు ల్యాండ్ కావాలని, పెండింగ్ స్కాలర్‌షిప్, ట్యూషన్ ఫీజులు విడుదల చేయాలని కోరారు. కలెక్టర్‌ను కలసిన వారిలో రిజిస్ట్రార్ డా. మధుసూదన్‌రెడ్డి ఉన్నారు. అనంతరం కలెక్టర్ విసికి శుభాకాంక్షలు తెలిపారు.



కలెక్టర్‌కు బొకే అందజేస్తున్న పియు విసి శ్రీనివాస్

# సన్న వడ్లకు ప్రభుత్వం నుండి 500 బోనస్..

- సన్న రకం వరి ధాన్యాన్ని గుర్తించడంలో ఇంచార్జ్‌లు తప్పనిసరిగా అవగాహన కలిగి ఉండాలి...
- ధాన్యాన్ని గుర్తించడం కోసం డిజిటల్ గ్రేయిన్ కాలిబర్ మీటర్‌ను తీసుకోవాలి ...
- జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి



వ్యవసాయ అధికారులతో మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి



సమావేశంలో హాజరైన జిల్లా అధికారులు

**వనపర్తి,అక్టోబరు 24 ప్రభాతవార్త :** సన్న రకం వరి ధాన్యాన్ని గుర్తించడంలో ధాన్యం కొనుగోలు కేంద్రాల ఇంచార్జ్‌లు తప్పనిసరిగా అవగాహన కలిగి ఉండాలని జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి సూచించారు. గురువారం నాగవరంలోని రైతు వేదికలో పౌర సరఫరాల శాఖ ఆధ్వర్యంలో పీపీసీ నిర్వాహకులకు సన్న రకం వరి ధాన్యం గుర్తించడం పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ సన్న రకం వరి ధాన్యాన్ని గుర్తించడంలో ధాన్యం కొనుగోలు కేంద్రాల ఇంచార్జ్ లు తప్పనిసరిగా అవగాహన కలిగి ఉండాలని సూచించారు. ఈ సారి ప్రభుత్వం సన్నా లకు రూ.500 బోనస్ కల్పిస్తున్న నేపథ్యంలో ధాన్యాన్ని గుర్తించడంలో అప్రమత్తంగా ఉండాలన్నారు.

**ప్రతి ఒక్కరూ డిజిటల్ గ్రేయిన్ కాలిబర్ మీటర్‌ను తీసుకోవాలి**

ప్రతి ఒక్కరూ డిజిటల్ గ్రేయిన్ కాలిబర్ మీటర్ ను తీసుకొని ధాన్యాన్ని గుర్తించడం నేర్చుకోవాలని చెప్పారు. ఏదైనా సెంటర్ నుంచి తప్పుగా ధాన్యాన్ని లోడ్ చేసినట్లు తెలితే చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. అసలైన సన్నాలు వేసిన రైతులు నష్టపోకుండా జాగ్రత్తగా వ్యవహరించాలన్నారు. ఏమైనా సందేహాలు ఉంటే వెంటనే ఏఈఓ లను సంప్రదించాలన్నారు. వర్ష సమాచారంపై అప్రమత్తంగా ఉండి ధాన్యం తడవకుండా ఏర్పాట్లు చేయాలని పీపీసీ ఇంచార్జ్ లకు కలెక్టర్ ఆదేశించారు.

**రేషన్ దుకాణం ఆకస్మిక తనిఖీ**

జిల్లా కేంద్రంలోని కేడిఆర్ నగర్ లో ఉన్న 16వ నంబర్ రేషన్ దుకాణాన్ని కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. రేషన్ దుకాణం లో సరుకులకు సంబంధించిన రిజిస్టర్లు, బయోమెట్రిక్ సమయానికి లేకపోవడం పై ఆగ్రహం వ్యక్తం చేశారు.

**ఈవీఎం గోదాం సాధారణ తనిఖీ**

ఎమ్మార్వో కార్యాలయం వద్ద ఉన్న ఈవీఎం గోదాంలో కలెక్టర్ సాధారణ తనిఖీ చేశారు. ప్రతినెల చేసే తనిచల్లో భాగంగా ఆయన రెవెన్యూ అధికారులతో కలిసి సందర్శించారు. ఈ సమావేశంలో పౌర సరఫరాల శాఖ డిఎం ఇర్ఫాన్, డిసిఓ ప్రసాద రావు, డిసీఎస్ఓ కాశీ విశ్వనాథ్, డిఆర్డిఓ పీడీ ఉమాదేవి, జిల్లా వ్యవసాయ అధికారి గోవింద్ నాయక్, ఆర్డిఓ పద్మావతి, తహశీల్దార్ రమేష్ రెడ్డి, ఏఈఓ లు, వ్యవసాయ శాఖ సిబ్బంది, వరిధాన్యం కొనుగోలు కేంద్రాల ఇంచార్జ్‌లు, ఐకేపీ,పీఏసీఎస్, మెప్మా సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## ఎల్ఆర్ఎస్ దరఖాస్తులను

# వేగవంతంగా పరిష్కరించాలి:కలెక్టర్



ఎల్ఆర్ఎస్ దరఖాస్తులను పరిశీలన చేస్తున్న కలెక్టర్ సంతోష్, అదనపు కలెక్టర్ లక్ష్మి నారాయణ

**గద్వాల, అక్టోబరు 24 ప్రభాతవార్త:** గురువారం గద్వాల్ మున్సిపల్ పరిధి, ఎర్రవల్లి లో ఎల్ఆర్ఎస్ దరఖాస్తులను క్షేత్రస్థాయిలో మొబైల్ యాప్ ద్వారా నిర్వహిస్తున్న విధానాన్ని అదనపు కలెక్టర్ లక్ష్మి నారాయణతో కలిసి కలెక్టర్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం జారీ చేసిన ఆదేశాల ప్రకారం ఎల్ఆర్ఎస్ దరఖాస్తులను సక్రమంగా పరిశీలించి ప్రతి దరఖాస్తు వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని అధికారులకు ఆదేశించారు. క్షేత్రసందర్శనలో భాగంగా మొబైల్ యాప్ ను ఉపయోగించి ఎల్ఆర్ఎస్ దరఖాస్తు వివరాలను తెలుసుకున్నారు. లేఅవుట్ ప్లాట్స్ ప్రాంతాన్ని ప్లాట్ గుర్తింపు కోసం ఏర్పాటు చేసిన రాళ్లను ఆయన పరిశీలించారు. లేఅవుట్ పేర్లు, యజమాని వివరాలు, చదరపు గజాల పరిణామం, రోడ్డు ప్రభావిత ప్రాంతం వంటి అంశాలను పూర్తిస్థాయిలో నమోదు చేయాలని అధికారులకు ఆదేశించారు. ప్లాట్ ఫోటోలను, లాటిట్యూడ్ లంగిట్యూడ్ నాలుగు పైపులు, డాక్యుమెంట్ల అప్‌లోడ్ విషయంలో ముఖ్యంగా లేఅవుట్ సంబంధిత పత్రాలపై పూర్తి జాగ్రత్త వహించాలని సూచించారు. ప్రభుత్వ భూములను గుర్తిస్తూ, భూములు నీటి వనరుల బఫర్ జోన్, నాలా, చెరువులు, కోర్టు కేసులు ఇలాంటి విషయాలను పరిశీలించుకోవాలని సంబంధిత అధికారులకు సూచించారు. దరఖాస్తుదారులను సంప్రదించి సమయానుసారం అన్ని దరఖాస్తులను పరిష్కరించాలని అన్నారు. ప్రతిరోజు వచ్చిన దరఖాస్తులను పూర్తి చేసి మొబైల్ యాప్‌లో నమోదు చేయడం జరగాలని అన్నారు. ముఖ్యంగా మున్సిపల్, గ్రామస్థాయిలో నీటిపారుదల శాఖ పెండింగ్ ఎల్ఆర్ఎస్ దరఖాస్తులను త్వరగా పూర్తి చేయాలని నీటి పారుదల ఈ.ఈ కు ఆదేశించారు. గ్రామపంచాయతీ, మున్సిపల్, రెవెన్యూ, నీటి పారుదల శాఖల అధికారులు సమన్వయంతో పని చేసి పెండింగ్ దరాకాస్తులను పరిష్కరించాలని ఆదేశించారు. అనంతరం ఎర్రవల్లి మండలంలోని ఎర్రవల్లి, తిమ్మాపూర్ గ్రామాల్లో ఎల్.ఆర్.ఎస్ దరఖాస్తులను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా అన్ని డాక్యుమెంట్లు, లేఅవుట్ మ్యాప్‌లను పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ డిపిఓ , పంచాయతీ కార్యదర్శి లకు పెండింగ్ దరఖాస్తులను త్వరగా పూర్తిచేయాలని ఆదేశించారు. ముఖ్యంగా అప్రోచ్ రోడ్లు, రహదారికి ప్రభావిత ప్రాంతాల పై ప్రత్యేకంగా దృష్టి పెట్టాలని అన్నారు. సమీపంలోని నీటి వనరులను పర్యవేక్షించాలని నీటి పారుదల శాఖ అధికారులకు ఆదేశించారు. ఆన్‌లైన్‌లో ఎటువంటి పొరపాట్లు జరగకుండా చూసుకోవాలని, సంబంధిత దరఖాస్తుదారులను కాల్ చేసి, పెండింగ్ దరఖాస్తులను త్వరగా పూర్తి చేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ దశరథ్, డిపిఓ శ్యాంసుదర్, ఇరిగేషన్ ఈ.ఈ శ్రీనివాస రావు, టౌన్ ప్లానింగ్ అధికారి కుర్మన్న, ఆర్.ఐలు ,ఎఈలు, పంచాయితీ సెక్రటరీ మున్సిపల్ అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థులకు నాణ్యమైన

# విద్యాబోధనందించాలి

**జోగులాంబ గద్వాల జిల్లా కలెక్టర్ సంతోష్**



పాఠశాలను ఆకస్మికంగా తనిఖీ చేసిన కలెక్టర్ సంతోష్

**గద్వాల, అక్టోబరు 24 ప్రభాతవార్త:** విద్యార్థులు మంచి మార్కులు సాధించే విధంగా నాణ్యమైన విద్య బోధన అందించాలని జిల్లా కలెక్టర్ బి.యం.సంతోష్ ఆదేశించారు. గురువారం ఎర్రవల్లి మండలం బీచుపల్లిలోని టిజి రెసిడెన్సియల్ స్కూల్ మరియు కాలేజీ బాలుర ఆకస్మికంగా తనిఖీ చేసి, తరగతి గదులను, హాస్టల్, మెస్ తదితర ప్రాంతాలను కలెక్టర్ పరిశీలించారు. ఈ సందర్భంగా పాఠశాలలో చదువుతున్న విద్యార్థులతో కలెక్టర్ ముఖాముఖిగా ముచ్చటించి, సబ్జెక్టుల వారిగా వారి విద్యాసామర్థ్యాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ విద్యార్థులు ఈ సంవత్సరం మంచి మార్కులు సాధించడంతో పాటు ఉత్తమ ఫలితాలు వచ్చే విధంగా ఉపాధ్యాయులు చొరవ చూపాలన్నారు. విద్యార్థులకు పాఠాలు స్పష్టంగా, అర్థమయ్యే విధంగా బోధించాలని తద్వారా వవారు సులభంగా అర్థం చేసుకుని మంచి ఫలితాలు సాధించగలుగుతారని అన్నారు. ప్రతి విద్యార్థి యూనిఫామ్‌లో ఉండాలని, విద్యార్థులకు ఎప్పటికప్పుడు పరీక్షలు నిర్వహిస్తూ వారి విద్యాసామర్థ్యాన్ని పరిశీలిస్తూ ఉండాలన్నారు. విద్యార్థులు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అన్ని మౌలిక వసతులు కల్పఇంచాలని సూచించారు. విద్యార్థులు ఆరోగ్యంగా ఉండటానికి సరైన ఆహారం చాలా అవసరమని, అందుకు మెనూ ప్రకారం ప్రతిరోజు పౌష్టిక ఆహారం అందించాలన్నారు. పాఠశాల పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, పాఠశాలలో విద్యార్థులకు ప్రోత్సాహం అందిస్తూ, పాటశాల ఫలితాలు మెరుగుపరచడానికి ఉపాధ్యాయులు, ప్రిన్సిపాల్ అందరూ కలిసి పని చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ శ్రీనివాస్, ఉపాధ్యాయులు, తదితరులు పాల్గొన్నారు.

# విన్నపాలు... ప్రతిపాదనలు..

- పాలమూరు రైల్వే సమస్యలకు పరిష్కారం దిశగా అడుగులు
- సికింద్రాబాద్ రైల్ నిలయంలో దక్షిణ మధ్య రైల్వే కీలక సమావేశం
- పాలమూరు రైల్వే సమస్యలను అధికారులదృష్టికి తీసుకెళ్లిన ఎంపి డికె అరుణ



రైల్వే నిలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో పలు అంశాలను ప్రస్తావిస్తున్న ఎంపి డికె అరుణ

**మహబూబ్‌నగర్ బ్యూరో,అక్టోబరు 24 ప్రభాతవార్త :** పాలమూరులో రైల్వే సమస్యల పరిష్కారానికి పక్కా ప్రణాళికలతో ముందుకు వెళ్తున్నామని బిజెపి జాతీయ ఉపాధ్యక్షురాలు, మహబూబ్‌నగర్ ఎంపి డికె అరుణ అన్నారు. గురువారం సికింద్రాబాద్ రైల్ నిలయంలో కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి, సౌత్ సెంట్రల్ రైల్వే జీఎమ్ ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశంలో మహబూబ్‌నగర్ పార్లమెంట్ పరిధిలోని మహబూబ్‌నగర్, దేవరకద్ర, జడ్చర్ల, నారాయణపేట, షాద్ నగర్‌తో పాటు ఆర్‌ఓబి, ఆర్‌యుబిల సమస్యలు, ఏర్పాటు సీజీయాల్సిన ప్రాంతాలు, ఎంఎంటిఎస్ రైలు ఎక్స్‌టెన్షన్, కృష్ణ, మలక్‌పేట, గద్వాల స్టేషన్‌ల ఆవశ్యకతను రైల్వే అధికారుల దృష్టికి తీసుకువెళ్లారు. తమ ఎపార్లమెంట్ పరిధిలోని ఈ సమస్యల పరిష్కారానికి చొరవ చూపాలని సూచించారు.

**ప్రస్తావించిన అంశాలు...**

మహబూబ్‌నగర్ పరిధిలోని వీరన్నపేట, తిమ్మసానిపల్లిలో ఆర్‌యుబి, మోతినగర్ వద్ద (ఫుట్‌ఓవర్ బ్రిడ్జి), దేవరకద్ర పట్టణంలో ఆర్‌ఓబి ఉన్నప్పటికి పట్టణంలో ప్రజల రాకపోకలను దృష్టిలో పెట్టుకొని ఆర్‌యుబి, కౌకుంట్ల ఎస్‌ఈ 80,81 క్రాసింగ్ దగ్గర ఆర్‌యుబి ఏర్పాటు చేయాలని కోరారు. అదే విధంగా రంగారెడ్డిగూడ (జడ్చర్ల)లో ఆర్‌ఓబి, వనపర్తి స్టేషన్ రోడ్ 19ఎ వద్ద శ్రీరామ్‌నగర్ ఆర్‌ఓబి ఏర్పాటు చేయాలని విన్నవించారు. మహబూబ్‌నగర్‌లో గూడ్స్ షెడ్ క్లోజ్ చేశారని దానిని తిరిగి ఓపెన్ చేయాలని కోరారు. కొత్త రైల్వే లైన్ల ప్రస్తావన...కృష్ణ, వికారాబాద్ రైల్వే లైన్స్ పురోగతిపై ఎంపి డికె అరుణ ఆరా తీశారు. త్వరగా రైల్వే లైన్స్ పూర్తి చేయాలని, రైల్వే ఉన్నతాధికారులకు సూచించారు. ఇలా ఉండగా కొత్త రైల్వే లైన్ల ప్రతిపాదనను కూడా ఎంపి సమావేశంలో ప్రస్తావించారు. మహబూబ్‌నగర్ టు తాండూరు, జడ్చర్ల నుంచి నంద్యాల, మిర్యాలగూడ రైల్వేలైన్‌లు ఏర్పాటు చేయాలని ప్రతిపాదించారు. జడ్చర్ల వద్ద రైల్వే పోలీస్ ఔట్ పోస్టు ఏర్పాటు చేయాలని కోరారు. కృష్ణ రైల్వే స్టేషన్‌లో రైలు ఆపాలని కోరారు. ఇదే విషయమై పలుమార్లు వినతి పత్రం అందజేసిన పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. అదేవిదంగా హంద్రి, ఇంటర్‌సిటి ఎక్స్‌ప్రెస్ మలక్‌పేటలో ఆపాలని, 47173, 47210 ఎంఎంటిఎస్ రైలును ఎక్స్‌టెన్షన్ షాద్‌నగర్ వరకు పొడిగించాలని, వందేభారత్ ట్రైన్ గద్వాల స్టేషన్‌లో ఆగేలా చూడాలని కోరారు. గద్వాల స్టేషన్ ఏర్పాటై 100 ఏళ్లు అయినా శతాబ్ది ఉత్సవాలు ఎందుకు నిర్వహించలేదని ప్రశ్నించారు. ఉత్సవాలు నిర్వహించాల్సిన అవసరం ఎంతైనా ఉందని సూచించారు.

## పెండింగ్‌లో ఉన్న అభివృద్ధి

# పనులను పూర్తి చేయాలి

**మంత్రి జూపల్లికి కాంగ్రెస్ కార్యకర్తల విన్నపం**



మంత్రికి వినతి పత్రం ఇస్తున్న వీపనగండ్ల కాంగ్రెస్ కార్యకర్తలు

**వీపనగండ్ల అక్టోబరు 24 ప్రభాతవార్త :** మండలంలోని పలు అభివృద్ధి పనులు పెండింగ్లో ఉన్నటువంటివి వెంటనే పనులు చేపట్టి వీపనగండ్ల మండలాన్ని అభివృద్ధి పథంలో నడిపించాలని వీపనగండ్ల మండల కాంగ్రెస్ పార్టీనాయకులు గురువారం నాడు మంత్రి జూపల్లి కృష్ణారావుకు వినతిపత్రం అందజేశారు. కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు గోదలబీరయ్యయాదవ్, రైతుబంధు మండలఅధ్యక్షుడు ఎత్తం కృష్ణయ్య, రవీందర్‌రెడ్డి, మునిగొండగోపి, సోడావెంకటస్వామి, బస్వరాజ్ గౌడ్, పాల్గొని వినతిపత్రం అందించారు. మండలంలోని మండల మహిళా సమైక్య భవనాన్ని నిర్మించుట గ్రామ మహిళా సంఘ భవన – మిగతా2లో..

## సీఎంపై అనుచిత వ్యాఖ్యలు చేయడం తగదు

**మక్తల్ ఎమ్మెల్యే డా.వాకిటి శ్రీహరి**



మాట్లాడుతున్న ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి

**మక్తల్, అక్టోబరు 24 ప్రభాతవార్త :** సీఎం రేవంత్‌రెడ్డిపై ఇటీవల మక్తల్ మాజీ ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్‌రెడ్డి అనుచిత వ్యాఖ్యలు చేయడం తగదని, ఇప్పటికైనా ఆయన తన వైఖరి మార్చుకోకపోతే తగిన బుద్ధి చెప్తామని మక్తల్ ఎమ్మెల్యే డా. వాకిటి శ్రీహరి అన్నారు. గురువారం పట్టణంలో నిర్వహించిన విలేఖరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ గతంలో ప్రజా సమస్యలను ఏ మాత్రం పట్టించుకోని మాజీ ఎమ్మెల్యే ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వంపై అవాకులు చవాకులు పేలడం సిగ్గుచేటని ఆయన అన్నారు. గత ప్రభుత్వాల హయాం నుంచే పుంజనూరు ఎత్తిపోతల పథకం కరెంటు బిల్లులను జారీ చేస్తున్నారని ఆయన అన్నారు. ఇదే పద్ధతిని ప్రస్తుత ప్రభుత్వం అవలంబిస్తున్నదని ఆయన అన్నారు. కానీ ఎప్పుడు కూడా రైతులు కరెంటు బిల్లులు చెల్లించలేదన్నారు. రైతుల మేలుకోరే తమ ప్రభుత్వం రైతులపై విద్యుత్ ఛార్జీల భారాన్ని వీలైనంత తగ్గించే ప్రయత్నం చేస్తుందని ఆయన అన్నారు. కార్యక్రమంలో మాజీ జడ్పీటిసి జి. లక్ష్మారెడ్డి, ఆనంద్‌గౌడ్, బోయ రవికుమార్, శివరాంరెడ్డి పాల్గొన్నారు.

## పత్తి కొనుగోలు కేంద్రాలను వెంటనే ప్రారంభించాలి



వినతి పత్రం సమర్పిస్తున్న దృశ్యం

**మక్తల్,అక్టోబరు 24 ప్రభాతవార్త :** రైతుల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని సీసీఐ ద్వారా పత్తి కొనుగోలు కేంద్రాలను వెంటనే ప్రారంభించాలని సిపిఎం జిల్లా కార్యదర్శి వెంకటరామిరెడ్డి డిమాండ్ చేశారు. అధిక వర్షాలతో పంటలు దెబ్బతిని రైతాంగం తీవ్రంగా నష్టపోవడం జరిగిందని, అరకొరగా పండిన పంటను ప్రైవేట్ వారికి అమ్మడంతో క్వింటాల్‌కు రూ. 2 వేల నుండి రూ. 3 వేల వరకు రైతాంగం నష్టపోతున్నారన్నారు. ఈ మేరకు గురువారం మక్తల్ తహసిల్దార్ కార్యాలయం ముందు నిరసన తెలిపి, తహసిల్దార్‌కు వినతిపత్రం అందజేశారు.కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు పి. ఆంజనేయులు, జిల్లా కమిటి సభ్యులు గోవిందరాజ్, సిఐటియు మండల కన్వీనర్ నారాయణ, సిపిఎం నాయకులు నర్సింహ,నయ్యుమ్,అశోక్,లింగారెడ్డి, మారెప్ప, బాలరాజు తదితరులు పాల్గొన్నారు.

## బాస్కెట్‌బాల్ ఎంపికైన ఆదర్శ డిగ్రీ కళాశాల విద్యార్థులు




బాస్కెట్ బాల్‌కు ఎంపికైన జట్టు

**మహబూబ్‌నగర్,అక్టోబరు 24 ప్రభాతవార్త :** నవంబర్ 1వ తేదీ నుండి 5వ తేదీ వరకు క్రైస్ట్ యూనివర్సిటీ బెంగుళూరులో జరిగే సౌత్‌జోన్ బాస్కెట్ బాల్ చాంపియన్‌షిప్ పోటీలలో పాల్గొనే పాలమూరు విశ్వవిద్యాలయ బాస్కెట్ బాల్ పురుషుల జట్టుకు ఆదర్శ డిగ్రీ కళాశాల ప్రథమ సంవత్సరం బిబిఏ విద్యార్థులు ఎంపికయ్యారు. ఎంపికైన విద్యార్థులలో అబ్దుల్ రాఫే, రియాన్ మొహ్మద్ షేక్‌లు ఎంపికైనట్లు ఆదర్శ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ శ్రీనివాస్ తెలిపారు. ఈ సందర్భంగా కళాశాల అవగాహన నిర్వహించిన ఫొటో కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మహబూబ్‌నగర్ ఎడ్యుకేషనల్ సొసైటీ కార్య దర్శి బి. రాములు, కోశాధికారి అరుణ్ కుమార్‌రెడ్డి,పాలమూరు విశ్వవిద్యాలయం బాస్కెట్ బాల్ జట్టుకు ఎంపికైన విద్యార్థులను అభినందించారు. కార్యక్రమంలో ఆదర్శ డిగ్రీ కళాశాల వ్యాయా మ ఉపాధ్యాయుడు మహ్మద్ ఇలియాస్, ఆదర్శ బిఈడీ కళాశాల ప్రిన్సిపల్ జనార్ధన్‌రెడ్డి, అధ్యాపక బృందం అభినందించారు.

## ఎమ్మెల్యేను సన్మానించిన కాంగ్రెస్ నాయకులు



ఎమ్మెల్యేను సన్మానిస్తున్న దృశ్యం

**కృష్ణ,అక్టోబరు 24 ప్రభాతవార్త :** కృష్ణ మండల కేంద్రం రైల్వే బ్రిడ్జి నుండి గురజాల గ్రామానికి రూ. 2 కోట్ల 40 లక్షలతో బిటి రోడ్డు నిర్మాణానికి నిధుల మంజూరుకు చొరవ చూపిన ఎమ్మెల్యే డా. వాకిటి శ్రీహరి ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో గ్రామస్తులు, కాంగ్రెస్ నాయకులు గురువారం కలిశారు. ఈ సందర్భంగా శాలువా,పూలమాలలతో పుష్ప గుచ్చం అందజేసి సత్కరించారు. ఈ సందర్భంగా చాలా రోజులుగా తీరకుండా ఉన్న బిటి రోడ్డు కల నెరవేరినందుకు గ్రామస్తులు ఆనందం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో మండల కాంగ్రెస్ అధ్యక్షుడు రాజప్పగౌడ, రవిగౌడపాటిల్, సోమ సంతోష్ శెట్టి, మాజీ ఎంపిపి లింగప్ప తదితర నాయకులు పాల్గొన్నారు.

## దీగ్రస్ నియోజకవర్గ నాయకులతో సమాలోచనలు చేసిన ఎమ్మెల్యే తూడి మేగారెడ్డి



ఎమ్మెల్యేను సన్మానిస్తున్న దీగ్రస్ నియోజకవర్గ నాయకులు

**వనపర్తి టౌన్ అక్టోబరు 24 ప్రభాతవార్త :** మహారాష్ట్ర రాష్ట్రంలోని దీగ్రస్ నియోజకవర్గంలో జరగబోయే ఎమ్మెల్యే ఎన్నికల ప్రక్రియపై, అక్కటి రాజకీయ పరిస్థితులపై గురువారం వనపర్తి ఎమ్మెల్యే తూడి మేగారెడ్డి స్థానిక కాంగ్రెస్ పార్టీ నాయకులతో సమాలోచనలు చేశారు. దీగ్రస్ నియోజకవర్గ ఎన్నికల ఇంచార్జిగా ఎంపికైన ఆయన గత రెండురోజులుగా నియోజకవర్గ రాజకీయాలపై ఆరా తీస్తు పూర్తి సమాచారాన్ని సేకరిస్తున్నారు. ఈ సందర్భంగా నియోజకవర్గానికి వచ్చిన ఆయనకు మాణిక్ రావు ఠాక్రే కుమారుడు రాహుల్ ఠాక్రే శాలువాతో సన్మానించి స్వాగతం పలికారు. అనంతరం నియోజకవర్గంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఆయన స్థానిక బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులతో యూత్ కాంగ్రెస్ అధ్యక్షులతో ఎన్ఎస్‌యూఐ అధ్యక్షులతో సమావేశమయ్యారు. రానున్న ఎమ్మెల్యే ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ బలపరిచిన అభ్యర్థిని భారీ మెజార్టీతో గెలిపించేందుకు పూర్తిస్థాయిలో ప్రతి ఒక్కరు కృషి చేయాలని ఎమ్మెల్యే వారికి సూచించారు.

## పెండింగ్‌లో ఉన్న అభివృద్ధి పనులను పూర్తి చేయాలి

**మొదటి పేజీ తరువాయి భాగం..**

నిర్మాణాన్ని చేపట్టుట గురుకులపాఠశాల నిర్మాణానికి నిధులుకేటాయించుట తాత్కలిక మరమ్మత్తులు చేపట్టి వెంటనే ఎస్సీగురుకుల పాఠశాలను వీపనగండ్లకు తరలించుట మండలకేంద్రంలోని పశు వైద్యశాలకు డాక్టర్‌ను నియమించుట 30పడకల ఆసుపత్రికి వైద్యసిబ్బంది పరికరాలు సమకూర్చుట ఆసుపత్రికి వెంటనే 24 గంటలు డాక్టర్లు అందుబాటులో ఉండాలి. మండల కేంద్రం నుండి కల్వరాల,కేతపల్లి వరకు డబల్ బీటీరోడ్లు నిర్మాణము సింగోటం,గోపాల్దిన్నె లింకు కాలువను వెంటనే పూర్తిచేయాలి మండలకేంద్రానికి అదనపు బస్సులు వేయించుట,మండల కేంద్రంలో అసంపూర్తిగా ఉన్న ఆర్టీసీ బస్టాండు మూత్రశాలల నిర్మాణాలను చేపట్టుట ,వేసవి కాలంలో రైతుల ఉపయోగం కోసం జూరాల బీమా కాల్వల మరమ్మత్తులు చేయించుట ,గోవర్ధనగిరి గ్రామ సమీప బ్రిడ్జి గోపాల్దిన్నె కత్వ బ్రిడ్జి నిర్మాణము చేపట్టుట, మండల కేంద్రానికి సివిల్ సప్లై గోదామును కేటాయించుట, మండల కేంద్రంలో సీఐ కార్యాలయం ఏర్పాటు చేయుట ,సబ్ కోర్టును ఏర్పాటు చేయుట ,మండల కేంద్రంలో డిగ్రీ కళాశాల ఏర్పాట్ల కస్తూరిబా గాంధీ బాలికల కేజీబీవీ బాలికల పాఠశాలలో ఇంటర్మీడియట్ విద్యను ప్రవేశపెట్టడం ,వ్యవసాయ ఏడి కార్యాలయాన్ని ఏర్పాటు చేయుట ,మినీ మామిడికాయల విక్రయ మార్కెట్ ఏర్పాటు, ఉద్యాన వన శాఖ మండల స్థాయి కార్యాలయం ఏర్పాటు జూనియర్ కాలేజీలో ఒకేషనల్ కోర్సులు ఏర్పాటు చేయాలి వారు ఆయనను కోరారు.

## అసెంబ్లీని సందర్శించిన జర్మనీ పార్లమెంట్ సభ్యులు

**మొదటి పేజీ తరువాయి భాగం..**

పలికారు. అనంతరం ఇరు దేశాలకు సంబంధించిన పెట్టుబడులు, సత్సంబంధాలు గురించి సుదీర్ఘంగా చర్చించారు. తెలంగాణ రాష్ట్రంలో ప్రజాపాలన గురించి చర్చించినప్పుడు జర్మనీ డెలికేట్స్ చాలా ఆసక్తి కనబరిచారు. తెలంగాణ రాష్ట్రంలో జరుగుతున్న అభివృద్ధిని వారికి ఎమ్మెల్యే యెన్నం వివరించారు. తెలంగాణ రాష్ట్రంలో ఆటోమొబైల్ రంగంలో పెట్టుబడులు పెట్టడానికి తెలంగాణ రాష్ట్రం అనువైన ప్రదేశం అని, ఫోర్త్ సిటీలో పెట్టుబడులను తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం సింగిల్ విండో విధానంలో అవకాశం కల్పిస్తుందని తెలిపారు.

# బాల్య వివాహాలను అరికట్టడంలో కలిసికట్టుగా పనిచేయాలి





మండల పరిషత్ కార్యాలయంలో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ సంచిత్ గంగ్వార్

**ఖిల్లాఘణపురం అక్టోబరు 24 ప్రభాతవార్త :** బాల్య వివాహాలను అరికట్టడంలో గ్రామ స్థాయి నుండి మండల స్థాయి అధికారుల వరకు అందరూ కలిసికట్టుగా పనిచేయాలని జిల్లా స్థానిక సంస్థలు అదనపు కలెక్టర్ సంచిత్ గంగ్వార్ అన్నారు. గురువారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో పలు శాఖల అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బాల్య వివాహాలు ఎక్కడ జరిగిన వెంటనే స్పందించి కేసులు నమోదు చేయించాలని అధికారులకు ఆయన సూచించారు. గ్రామాలలో గ్రామ స్థాయి కమిటీలు మండలంలో మండల స్థాయి కమిటీలను ఏర్పాటు చేసి బాల్య వివాహాలపై వారికి సూచనలు ఇవ్వాలని చెప్పారు. గ్రామస్థాయిలో పంచాయతీ కార్యదర్శులు మండల స్థాయిలో తహశీల్దార్లు బాల్య వివాహాలు తమ దృష్టికి వస్తే వెంటనే కేసులు నమోదు చేసే అధికారం వారికి ఉంటుందన్నారు. గ్రామాలలో అన్ని కులమతాలకు సంబంధించిన పెద్దలతో బాల్య వివాహాలు జరగకుండా వారికి తగు సూచనలు అందజేయాలన్నారు. అంతకు ముందు వెంకటం పల్లి గ్రామానికి చెందిన ప్రభుత్వ పాఠశాలతో పాటు అంగన్వాడి కేంద్రాన్ని తనిఖీ చేశారు. విద్యార్థులకు విద్యాబోధన విషయంలో ఉపాధ్యాయులు తగిన చర్యలు తీసుకోవాలన్నారు. పాఠశాలలో మరమ్మత్తు పనులు చేయించిన విధానంలో అదనపు కలెక్టర్ తన అసంతృప్తిని వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ సుగుణ, ఎంపీడీఓ వెంకటాచారి, ఐసిడిఎస్ సూపర్వైజర్ ఈదమ్మ,ఆయా గ్రామాలకు చెందిన పంచాయతీ కార్యదర్శులు అంగన్వాడీ సూపర్వైజర్లు పలువురు మండల స్థాయి అధికారులు పాల్గొన్నారు.

## చట్ట వ్యతిరేఖ కార్యక్రమాల్లో పాల్గొన్న వారికి కఠిన శిక్షలు..

**వి.రజని కార్యదర్శి జిల్లా న్యాయ సేవాధికార సంస్థ**




న్యాయ విజ్ఞాన సదస్సులో మాట్లాడుతున్న వి.రజని జిల్లా న్యాయ సేవాధికార కార్యదర్శి

**వనపర్తి టౌన్ అక్టోబరు 24 ప్రభాతవార్త :** పౌరులు సమాజంలో చట్ట వ్యతిరేక కార్యక్రమాలకు పాల్పడితే కఠిన శిక్షలు ఉంటాయని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి వి.రజని అన్నారు. గురువారం వనపర్తి జిల్లా కేంద్రంలో వాగ్దేవి జూనియర్ కళాశాలలో జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో విద్యార్థులకు న్యాయ విజ్ఞాన సదస్సు జరిగింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మైనర్ పిల్లలు వాహనాలను నడపరాదని సూచించారు. మైనర్లకు బాల్య వివాహాలు చేయరాదని వివరించారు. పిల్లల చేత పనులు చేయించరాదని వివరించారు. చట్టాన్ని అతిక్రమిస్తే సమాజంలో పలు అనర్థాలు చోటు చేసుకుంటాయని మెరుగైన సమాజ నిర్మాణంలో విద్యార్థులు యువత పాత్ర ఎంతైనా ఉందన్నారు. విద్యార్థులు చదువుతో పాటు చట్టాలపై అవగాహన పెంచుకొని సన్మార్గంలో పయనించాలని వివరించారు. లోక్ అదాలత్ లో ఉచిత న్యాయ సేవలు ఉన్నాయని అర్హులు అయిన వారు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. న్యాయవాదుల సంఘం ఉపాధ్యక్షుడు సచ లీగల్ కౌన్సిల్ దేగల కృష్ణయ్య మాట్లాడుతూ మహిళ చట్టాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా విద్యార్థులచే చట్ట వ్యతిరేక కార్యక్రమాలకు పాల్గొనబోమని ప్రతిజ్ఞ చేయించారు. అదేవిధంగా 14 సంవత్సరాలలోపు పిల్లలు పనిచేయరాదని, పిల్లలను పనిలోకి పెట్టుకున్న వారిపై కఠిన చర్యలు ఉంటాయని చెప్పారు. ఈ సదస్సులో సచ కేంద్రం కార్యనిర్వాహకురాలు ఎం కవిత న్యాయవాదులు నరేందర్ బాబు భరణి, కళాశాల ప్రధానాచార్యులు విజయ్ కుమార్, కళాశాల నిర్వహకురాలు స్వప్న, అధ్యాపకులు భాను, అశోక్ సాగర్, శివరాజ్, శేఖర్ గౌడ్, రమేష్ నాయక్, రాములు , శివ, కృష్ణయ్య , లోకదాలత్ సంస్థ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



చట్టాలను పరిరక్షిస్తామని ప్రతిజ్ఞ చేస్తున్న విద్యార్థులు

## అరెస్టులతో ఉద్యమాలను ఆపలేరు :రైతుల పక్షాన పోరాటం చేస్తాం



ధర్నా చేస్తున్న బిఆర్ఎస్ పార్టీ నాయకులు

**చిన్నచింతకుంట,అక్టోబరు 24 ప్రభాతవార్త :** ఈ వర్షాకాలం రైతు భరోసా ఇవ్వటం లేదంటూ రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ప్రకటించడంపై బిఆర్ఎస్ మండల శాఖ ఆధ్వర్యంలో పర్దీపూర్ గ్రామంలో బిఆర్ఎస్ నేతలు రైతులతో కలిసి రాష్ట్ర ప్రభుత్వ దిష్టిబొమ్మను దగ్ధం చేస్తే 20 మంది బిఆర్ఎస్ నేతలపై కేసు నమోదు చేసి అరెస్టు చేయడంపై గురువారం మండల బిఆర్ఎస్ నేతలు మండల కేంద్రంలోని బస్టాండ్ కూడలిలో ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా మాజీ ఎంపిపి హర్షవర్ధన్‌రెడ్డి, పార్టీ మండల అధ్యక్షులు కోటరాము, జిల్లా సర్పంచ్‌ల సంఘం మాజీ ఉపాధ్యక్షులు మోహన్‌గౌడ్‌లు మాట్లాడుతూ రైతుల పక్షాన పోరాటం చేస్తే కాంగ్రెస్ అరెస్టు చేయించడం సిగ్గుచేటని నేతలు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలో భాగంగా ప్రతి ఎకరాకు పెట్టుబడి సాయం కింద రూ.15 వేలు వెంటనే రైతు ఖాతాలో జమ చేయాలని వారు డిమాండ్ చేశారు. అరెస్టులతో ఉద్యమాలను ఆపలేరని కాంగ్రెస్ ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలను ప్రజా క్షేత్రంలో ఎండగడతామని వారు విమర్శించారు. ఎన్నికల సమయంలో కాంగ్రెస్ ఇచ్చిన ఆరు గ్యారంటీలతో ప్రజలు మోసం చేయడమేనని వారు తెలిపారు. రైతన్నల సంక్షేమం కోసం బిఆర్ఎస్ నిరంతరం పోరాటం చేస్తుందన్నారు. అంతకు ముందు స్థానిక పోలీస్ స్టేషన్ నుంచి బిఆర్ఎస్ నేతలు ర్యాలీగా బయలుదేరి బస్టాండ్ కూడలిలో బైఠాయించారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ నేతలు వట్టెం రాము, అజయ్‌కుమార్‌రెడ్డి, ఆయా గ్రామాల సర్పంచ్‌లు సతీష్, రఘువర్ధన్‌గౌడ్, రాఘవేందర్‌రెడ్డి, ఆయా గ్రామాల పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## బిఆర్ఎస్ కార్యకర్తను పరామర్శించిన మాజీ మంత్రి



బాధిత కుటుంబాన్ని పరామర్శిస్తున్న మాజీ మంత్రి నిరంజన్ రెడ్డి

**ఖిల్లాఘణపురం అక్టోబరు 24 ప్రభాతవార్త :** మండల పరిధిలోని మల్కిమియాన్ పల్లి గ్రామము వసరం తాండకు చెందిన మూన్య నాయక్ ఇటీవల ప్రమాదానికి గురై కాళ్ల చేతులు విరిగాయి. చికిత్స చేయించుకుని విశ్రాంతి తీసుకుంటున్న విషయం తెలుసుకున్న మాజీ మంత్రి నిరంజన్ రెడ్డి గురువారం వసరం తాండకు వెళ్లి బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. పార్టీ పరంగా అన్ని రకాలుగా అండగా ఉంటానని భరోసా ఇచ్చారు. అనంతరం తండాకు చెందిన పలువురు యువకులు వసంతం గ్రామం పంచాయతీగా ఏర్పాటు చేయడం పట్ల శాలువాతో సన్మానించి కృతజ్ఞతలు తెలియజేశారు. నిరంజన్ రెడ్డి గ్రామానికి వస్తున్న విషయాన్ని తెలుసుకున్న టిఆర్ఎస్ పార్టీ నాయకులు కార్యకర్తలు పెద్ద ఎత్తున మల్కిమియాన్ పల్లి గ్రామం తండా వరకు ఘనంగా స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ కృష్ణ నాయక్ ,మాజీ జెడ్పిటిసి కామ్య నాయక్, రాళ్ల కృష్ణయ్య, రంగారెడ్డి నందిమల్ల అశోక్ , శరత్, గుంటి రాములు, శ్రీనివాసులు, చంద్రశేఖర్ రెడ్డి, కృష్ణారెడ్డి, బుచ్చిరెడ్డి,గణేష్ రెడ్డి, యాదిరెడ్డి, పాతావత్ శంకర్, వసురం, చందు, గణేష్ నాయక్, శ్రీను నాయక్ తదితరులు పాల్గొన్నారు.



వసరం తండాను ప్రత్యేక గ్రామపంచాయతీగా ఏర్పాటు చేసినందుకు సన్మానిస్తున్న తండా యువకులు

## బొందలకుంట పేరునే కొనసాగించాలి



ఎమ్మెల్యేకు వినతి పత్రం సమర్పిస్తున్న దృశ్యం

**మక్తల్,అక్టోబరు 24 ప్రభాతవార్త :** మక్తల్ మండలంలోని బొంద లకుంట గ్రామానికి గత ప్రభుత్వ హయాంలో నర్సిరెడ్డిపల్లిగా పేరు మార్చడం జరిగిందని, దీనివల్ల తమకు అనేక ఇబ్బందులు ఎదురవుతున్నాయని, దీన్ని దృష్టిలో ఉంచుకుని గతంలో ఉన్న బొందలకుంటనే సాగించాలని గ్రామస్తులు డిమాండ్ చేశారు. ఈ మేరకు గురువారం ఎమ్మెల్యే డా. వాకిటి శ్రీహరికి వినతి పత్రం అందజేశారు. దీనిపై సానుకూలంగా స్పందించిన ఎమ్మెల్యే ప్రభుత్వం దృష్టికి సమస్యను తీసుకెళ్లి పరిష్కరించేందుకు కృషి చేస్తానని గ్రామస్తులకు హామీ ఇచ్చారు.

## గ్రామ మహిళా సమాఖ్య అధ్యక్షురాలిగా ఎత్తం చిట్టెమ్మ



గ్రామ మహిళా సంఘం అధ్యక్షురాలిగా ఎత్తం చిట్టెమ్మ

**వీపనగండ్ల అక్టోబరు 24 ప్రభాతవార్త :** వీపనగండ్ల గ్రామం మహిళా సమైక్య అధ్యక్షురాలు ఎత్తం చిట్టెమ్మ ను గురువారం మహిళా సమైక్య భవనంలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. గతంలో మహిళా సమైక్య గ్రామ అధ్యక్షురాలుగా పనిచేసిన లలితమ్మ పై పలు ఆరోపణలు రావడం సంఘాలకు చెడ్డ పేరు వస్తుందని అలాగే ఆరోపణలు రావడంతో సంఘ సభ్యులు ఏకగ్రీవంగా తీర్మానం చేసి లలితమ్మను తొలగించారు. అనంతరం సంఘ సభ్యులైన ఎత్తం చిట్టెమ్మ ను నూతన అధ్యక్షురాలుగా, కార్యదర్శిగా అలివేల, కోశాధికారిగా ఎల్లమ్మ, ఉపాధ్యక్షురాలుగా చెన్నమ్మ, సలహాదారుగా లత లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు మహిళా సమైక్య సిసి వీరయ్య బుక్ కీపర్ ఎల్లయ్య తెలిపారు.

## జోరుగా బీజేపీ సభ్యత్వ నమోదు..



సభ్యత్వ నమోదు చేయిస్తున్న బీజేపీ నాయకులు

**భూత్పూర్, అక్టోబర్24, ప్రభాతవార్త:** భారతీయ జనతా పార్టీ సభ్యత్వనమోదుకార్యక్రమంలో భాగంగా భూత్పూర్ పట్టణ మున్సిపల్ పరిధిలోని అమిస్తాపూర్‌లో గురువారంజిల్లా బీజేపీ మైనార్టీ మోర్చాఅధ్యక్షుడు ఎండి ఫారూక్ ఆధ్వర్యంలో ఇంటింటి ప్రచారం నిర్వహిస్తూ సభ్యత్వ నమోదుకు శ్రీకారం చుట్టారు. ఈకార్యక్రమానికి మోర్చా రాష్ట్రఅధ్యక్షుడు అఫ్సర్‌పాషా, రాష్ట్ర కార్యవర్గసభ్యుడు యూసఫ్, టౌన్‌అధ్యక్షుడు ముజాఫర్, బీజేపీ పార్టీ జిల్లానాయకులు రషీద్, ఉపాధ్యక్షులు జాన్సర్, సీనియర్ నాయకులు శివలింగం, ముత్యాల నర్సింహులు, ముత్యాల బ్రహ్మ న్న, మల్లిఖార్జున్, యాదగిరి, విజయ్, భాస్కర్, మల్లేష్, రాము పాల్గొన్నారు.

## వివాహ వేడుకల్లో మైనార్టీ నాయకులు..

**భూత్పూర్, అక్టోబర్ 24, ప్రభాతవార్త:** భూత్పూర్ పట్టణ కేంద్రంలోని కెఎంఆర్ ఫంక్షన్ హాల్‌లో భూత్పూర్ మున్సిపాలిటీ తొమ్మిదోవార్డుకు చెందిన మొహ్మద్ హుస్సేన్ కూతురు వివాహ(నిఖా) వేడుకల్లో మైనార్టీనాయకులు మొహ్మద్ సాధిక్, ఎండి యాసిన్, ఎండి ఖదీర్, ఎండి జహంగీర్, ఎండి అశ్వక్, ఎండి బాసిత్‌తో పాటు నాయకులు జగదీష్ తదితరులు పాల్గొని నూతన వధూవరులను ఆశీర్వదించి వారికి శుభాకాంక్షలు తెలిపారు.

## గ్రంథాలయ భవన నిర్మాణ పనుల పరిశీలన



భవన నిర్మాణ పనులను పరిశీలిస్తున్న చైర్మన్

**కోయిల్‌కొండ, అక్టోబరు 24 ప్రభాతవార్త :** మండల కేంద్రమైన కోయిల్‌కొండలో నూతనంగా నిర్మిస్తున్న గ్రంథాలయ భవన నిర్మాణాన్ని జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మల్లు నరసింహా రెడ్డి, గ్రంథాల సంస్థ కార్యదర్శి మనోజ్‌కుమార్‌లు గురువారం పరిశీలించారు. వారు ఈ సందర్భంగా మాట్లాడుతూ గ్రంథాలయ భవ న నిర్మాణాన్ని నాణ్యతతో నిర్మించాలని సంబంధిత కాంట్రాక్టర్‌కు సూచించారు. నిర్మాణ పనులను వేగవంతం చేసి అనుకున్న సమ యానికి పూర్తి చేయాలన్నారు. కార్యక్రమంలో డిఈ రాము, కాంట్రాక్టర్ విజయభాస్కర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## పుట్టు చీర కార్యక్రమంలో పాల్గొన్న డాక్టర్ జిల్లెల చిన్నారెడ్డి



చిన్నారిని ఆశీర్వదిస్తున్న జిల్లెల చిన్నారెడ్డి

**పెబ్బేరు అక్టోబరు 24 ప్రభాతవార్త :** పెబ్బేరు మండలం తిప్పాయిపల్లి గ్రామానికి చెందిన కవీందర్ గౌడ్ సబ్ స్టేషన్ ఆపరేటర్ కుమార్తె పుట్టుచీర కార్యక్రమానికి హాజరైన డాక్టర్ జిల్లెల చిన్నారెడ్డి రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షులు పాల్గొని చిన్నారిని ఆశీర్వదించడం జరిగింది. కార్యక్రమంలో పెబ్బేర్ టౌన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు కారుపాకుల వెంకట్ రాములు యాదవ్, మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ బి కృష్ణ, రాంపురం సహదేవుడు, మాజీ సర్పంచ్ రాజశేఖర్ గౌడ్, హరిబాబు, ఈశ్వర్ రెడ్డి, పాతపల్లి చంద్రశేఖర్, ఆనంద్‌సాగర్, రామేశ్వర్‌రెడ్డి కిసాన్‌సెల్ అధ్యక్షులు, తిప్పాయిపల్లి ఎల్లస్వామి, నవీన్ కుమార్ గౌడ్, ఈర్లదిన్నె, సుధాకర్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, బాలస్వామి, పిఆర్ఓ భాస్కర్ పాల్గొన్నారు.

## తప్పిపోయిన ఫోన్ బాధితుడికి అప్పగింత

**రూరల్ ఎస్సై జలంధర్ రెడ్డి**




బాధితునికి ఫోను అప్పగిస్తున్న ఎస్సై జలంధర్ రెడ్డి

**వనపర్తి రూరల్ అక్టోబరు 24 ప్రభాతవార్త :** వనపర్తి రూరల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో కొంతమంది బాధితులు సెల్ ఫోన్లు చోరీకి గురైనట్లు ఫిర్యాదు చెయ్యగా దానిపై విచారణ చేపట్టారు.ఎస్సై జలంధర్ రెడ్డి వివరాల ప్రకారం ఫోన్లో పోయినట్లు ఫిర్యాదారులు పోలీస్‌స్టేషన్లో దరఖాస్తులు ఇవ్వడంతో,సి.ఇ.ఐ.ఆర్ పోర్టల్ ద్వారా విచారణ చేపట్టి రికవరీ చేశారు, రికవరీ చేసిన ఫోన్ సింగయ్యపల్లి గ్రామానికి చెందిన బాధితుడు దివాకర్ కి అందించారు. వనపర్తి రూరల్ ఎస్సై జలంధర్ రెడ్డి మాట్లాడుతూ వనపర్తి పట్టణంలో మొబైల్ షాపుల యజమానులు తెలియజేస్తున్నాం ఎవరైనాఫోన్లను అమ్మినా గానీ కొన్న వారిపై కేసులు నమోదు చేస్తాం, ఎవరైనా మీ దగ్గరికి వస్తే ఖచ్చితంగా అతని దగ్గర సరైన ఆధారాలు పరిశీలించిన తర్వాత కొనుగోలు చేయాలి,మీకు ఏమైనా అనుమానాలు ఉంటే పోలీస్ వారికి సమాచారం ఇవ్వాలి అని తెలిపారు. ఎవరైనా బాధితులు ఫిర్యాదు చేసిన ఫోన్లో మీద దృష్టి సారిస్తాం మిగతా బాధితుల ఫోన్లో కూడా త్వరలోనే రికవరీ అయ్యేవిధంగా చూస్తాం అని తెలిపారు.

## ప్రజా రైతు సదస్సును జయప్రదం చేయండి


సమావేశంలో పాల్గొని మాట్లాడుతున్న టిఆర్ఎస్ నాయకులు

**పెబ్బేరు అక్టోబరు 24 ప్రభాతవార్త:** పెబ్బేరు మండల బిఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో గురువారం రోజు ప్రతి గ్రామంలో పాల్గొని కార్యకర్తలకు ప్రజా రైతు సదస్సును విజయ వంతం చేయాలని తెలియజేశారు. ఈ నెల 29న వనపర్తి పాలకేంద్రం దగ్గరలో నిర్వహించే ప్రజా రైతు సదస్సును విజయవంతం చేయాలని మండల అధ్యక్షులు వనం రాములు ఆధ్వర్యంలో యాపర్ల గుమ్మడం తాండ తిప్పాపల్లి అయ్యవారి పల్లిలో పర్యటిస్తూ ముఖ్య అతిథులుగా మాజీ ఆర్థిక శాఖ మంత్రి తన్నీరు హరీష్ రావు విచ్చేస్తున్నారని, కాంగ్రెస్ ప్రభుత్వం రైతులకు చేస్తున్న మోసాలను తెలియజేస్తూ,పంటకి 500 బోనస్,ఎకరానికి 15 వేల రైతు భరోసా,రైతు కూలీలకు 12 వేలు ఇలా 420 హామీలని అమలు చేస్తానని చెప్పి ఓట్లు దండుకొని గద్దెనెక్కిన రేవంత్ సర్కార్ ని నిలదీయాలని,సదస్సును విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో పెద్దింటి వెంకటేష్, రాజశేఖర్ సోషల్ మీడియా కన్వీనర్ వడ్డెరమేష్, మధు, యాదగిరి, యాపర్ల నరేందర్‌రెడ్డి,ఆనంద్,ఘట్టయ్య, గుమ్మడం తాండ,రంగదాస్ స్వామినాథ్, గుమ్మడంచెన్నయ్య,ఆంజనేయులు,ఈశ్వరయ్య,నరసింహ, బాలస్వామి, మూర్తి, తిప్పాపల్లి, ఆంజనేయులు, బుచ్చన్న,శంకరయ్య కెసిఆర్ అయ్యవారిపల్లి, బీచుపల్లి మద్దిలేటి రాజశేఖర్ గౌడ్ చారి పాల్గొన్నారు.

## బీసీ సంఘ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్‌కు సన్మానం


బిసి అధ్యక్షుని సన్మానిస్తున్న జిల్లా బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు

**పెబ్బేరు అక్టోబరు 24 ప్రభాతవార్త :** పెబ్బేరు రాష్ట్ర బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్ గౌడ్ ద్వారా బీసీ సంక్షేమ ప్రధాన కార్యదర్శి వనపర్తి ఇంచార్జిగా నియమించిన ఎస్.రామన్ గౌడు గురువారం హైదరాబాదులోని రవీంద్ర భారతిలో వనపర్తి జిల్లా బ్లాక్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు అక్కి శ్రీనివాస్ గౌడ్ శుభాకాంక్షలు తెలుపుతూ సన్మానించారు. ఈ కార్యక్రమంలో గౌడ సంఘం సభ్యులు బస్వరాజ్ గౌడ్, వెంకటయ్య గౌడ్, విష్ణు గౌడ్,రమేష్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## మాలల ఆత్మగౌరవ సభను విజయవంతం చేద్దాం

**అయిజ అక్టోబర్ 24 ప్రభాతవార్త:** ఈనెల 27 వ తేదీన నాగర్ కర్నూల్ జిల్లా కేంద్రంలో నిర్వహించబోయే మాలల ఆత్మగౌరవ సభను విజయ వంతం చేద్దామని ఎస్సీ వర్గీకరణ వ్యతిరేక మాల మహానాడు నాయ కులు, పిలునిచ్చారు. ఇందులో భాగంగా గురువారం పట్టణంలోని అంబేద్కర్ చౌక్ సమీ పంలో మాలల ఆత్మగౌరవ సభ పోస్టర్ ను విడుదల చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అలంపూర్ నియోజకవర్గ వ్యాప్తంగా ఉన్నటువంటి మాలలు పెద్ద ఎత్తున హాజరై సభను విజయవంతం చేయాలని కోరారు.కార్యక్రమంలో నియోజకవర్గ అధ్యక్షులు రంగముని మాజీ ఎంపిటిసి మునిస్వామి, శేఖర్ రాము, మల్లికార్జున్, గునల్ నరసింహులు, మాల వీరేష్, శ్రీకాంత్, తాయప్ప, వెంకటాన్న, ప్రవీణ్, లింగన్న, పరశురాముడు, ముని స్వామి, రవి, సాయి, గణేష్, కిషోర్ తదితరులు పాల్గొన్నారు.

## మున్నూరు కాపులకు సహకారం అందించాలి

**ఉట్కూర్,అక్టోబరు 24 ప్రభాతవార్త:** మండల కేంద్రంలోని స్థానిక పిఎసి ఎస్ ఛైర్మన్ మొట్కార్ బాల్‌రెడ్డి ఇంటి ఆవరణలో మున్నూరు కాపు ఉట్కూర్ అధ్యక్షుడు ఎం. ప్రతాప్ రెడ్డి అధ్యక్షతన నిర్వహించిన మున్నూరు కాపుకుల బాంధవుల సమావేశంలో ముఖ్య అతిథులుగా నారాయణపేట జిల్లా కమిటి అధ్యక్ష, కార్యవర్గ సభ్యులు బండి శివరాంరెడ్డి, యాంకె అనంతరెడ్డి, ఇతర మున్నూరు కాపు సభ్యులు హాజరై మండలంలోని మున్నూరుకాపు సంఘం కమిటీలను వేసిజిల్లాలోను మున్నూరు కాపు సభ్యులను అందరిని ఒక తాటిపైకి తీసుకురావాల్సిన బాధ్యత అందరిపై ఉందని తెలిపారు. ఈ సందర్భంగా మాజీ సర్పంచ్ సూర్యప్రకాష్‌రెడ్డి మాట్లాడుతూ మున్నూరు కాపు సభ్యులం దరు కష్టపడి ఉన్నతమైన పదవులు, ఉన్నతమైన స్థానంలో ఉండాలని వ్యాపార పరంగా వృత్తి పరంగా అన్ని రంగాల్లో ముందుండాలని తెలియజేశారు. కార్యక్రమంలో మున్నూరు కాపు సభ్యులు గోపాల్‌రెడ్డి, వై. నారాయణరెడ్డి, గరడి లక్ష్మారెడ్డి, మోహన్‌రెడ్డి, మాజీ ఎంపిటిసి కోరం పద్మ వెంకటరెడ్డి, తమ్మిరెడ్డి, ఎం.రాము, తరుణ్, హర్షవర్ధన్, మహేష్, అభిలాష్, సత్యపాల్, బసిరెడ్డి, శంకర్, మున్నూరు కాపు సభ్యులు పాల్గొన్నారు.

## పత్తి సాగులో అధిక సాంద్రత, సస్యరక్షణ చర్యలపై సెమినార్

**ఉప్పునుంతల,అక్టోబరు 24 ప్రభాతవార్త :** మండలంలోని కొరటికల్, తిప్పాపూర్, తాడూరు గ్రామాలలో కృషి విజ్ఞాన కేంద్రం పాలెం వారి ఆధ్వర్యంలో ప్రత్యేకంగా సెమినార్ నిర్వహించారు. ఈ సందర్భంగా రైతులకు అవగాహన కల్పిస్తూ అధిక సాంద్రత, పత్తి సాగు యాజమాన్య పద్ధతులపై అవగాహన కల్పించారు. ప్రస్తుత పరిస్థితిలో తక్కువ విస్తీర్ణంలో పంట అధిక దిగుబడి సాధించే విధంగా రైతులు అధిక సాంద్రత పద్ధతులను పాటించాలని క్షేత్రస్థాయిలో రైతులకు సూచించారు. అధిక సాంద్రత పద్ధతి ప్రాముఖ్యత వివరిస్తూ రైతులు ఈ పద్ధతి అనుసరించడం వలన కలిగే లాభాలపై ప్రోగ్రాం కో ఆర్డినేటర్ డా.టి.ప్రభాకర్‌రెడ్డి రైతులకు అవగాహన కల్పించారు. ఈ పద్ధతిలో పత్తి సాగు చేసుకోవడం వల్ల పంట ఒకేసారి పక్వానికి వచ్చి పంటకాలం తగ్గుతుందన్నారు. రెండో పంట సాగు వేసుకోవడానికి వీలుంటుందని ఈ ప్రాంత పొలాలు ఈ పద్ధతికి అనువుగా ఉన్నాయన్నారు. అదేవిధంగా అధిక సాంద్రత పత్తి యాజమాన్య పద్ధతులు, అధిక సాంద్రత పత్తి సాగులో సస్యరక్షణ చర్యల పట్ల శాస్త్రవేత్త డా. ఓ. శైల రైతులకు అవగాహన కల్పించారు. యాసంగిలో సాగు చేసుకునే వేరుశనగ, మినుములు, పెసర, మొక్కజొన్న పంటలో పాటించాల్సిన సస్యరక్షణ చర్యలపై రైతులకు అవగాహన కల్పించారు. ఈ శిక్షణా శిబిరంలో వారితో పాటు డా. బి. రాజశేఖర్, డా. ఆదిశంకర్, డా. రామకృష్ణ, రఘువరన్‌సింగ్, రాజేష్, జ్ఞానేశ్వర్, హరీష్‌తో పాటు భారీ సంఖ్యలో రైతులు పాల్గొన్నారు.

## రూ.500ల సిలిండర్ పత్రాల పంపిణీ

**నారాయణపేట టౌన్,అక్టోబరు 24 ప్రభాతవార్త:** ఇచ్చిన మాట ప్రకారం తెలంగాణ ప్రభుత్వం అందజేస్తున్న రూ.500లకే సిలిండర్ పత్రాలను గురువారం మండల పరిధిలోని కాన్‌కుర్తి గ్రామంలో కాంగ్రెస్ పార్టీ నాయకుల ఆధ్వర్యంలో అందజేశారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ మహాలక్ష్మీ పథకాన్ని అమలు చేస్తోంది. దారిద్ర్య రేఖకు దిగువన ఉన్న వారిపై ఆర్థిక భారం తగ్గించుటకై, కాలుష్య రహిత వంట మాధ్యమాన్ని అందించడమే లక్ష్యమన్నారు. కార్యక్రమంలో నాయకులు బస్వరాజ్, మహిళలు తదితరులు ఉన్నారు.

## పెండింగ్ స్కాలర్‌షిప్, ఫీజు రీయింబర్స్‌మెంట్ విడుదలచేయాలి

**నారాయణపేట టౌన్,అక్టోబరు24 ప్రభాతవార్త:** పెండింగ్‌లో ఉన్న స్కాలర్‌షిప్, ఫీజు రియాంబర్స్‌మెంట్ బకాయిలను తక్షణమే విడుదల చేయాలని ప్రగతిశీల ప్రజా స్వామ్య విద్యార్థి సంఘం ఆధ్వర్యంలో రాష్ట్ర కమిటి పిలుపు మేరకు గురువారం జిల్లా కేంద్రంలో (పిడిఎస్ యు) ఆధ్వర్యంలో పాత బస్టాండ్ నుండి కలెక్టరేట్ వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ ధర్నాకు పిడిఎస్‌యు జిల్లా సహాయ కార్యదర్శి వెంకటేష్ అధ్యక్షత వహించగా, పిడిఎస్‌యు జిల్లా అధ్యక్షుడు సాయికుమార్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. వారు మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో గత మూడు సంవత్సరాలుగా విద్యార్థులకు ఇవ్వాల్సిన రూ.6 వేల కోట్లకు పైగా స్కాలర్‌షిప్, ఫీజు రియాంబర్స్‌మెంట్ బకాయిలు నేటికి విడుదల చేయకుండా విద్యార్థులజీవితాలతో కాంగ్రెస్ రేవంత్‌రెడ్డి ప్రభుత్వం చెలగాటమాడడం సరైంది కాదన్నారు. కార్యక్రమంలో పిడిఎస్‌యు జిల్లా సహాయ కార్యదర్శి గౌస్,నాయకులు మహేష్, సురేష్, నవిత, నవ్యశ్రీ, అఖిల,అశ్విని, శ్వేత,స్వరూప, ప్రీతి, శిరీష, అజయ్,నరేష్,సాగర్, రాజు, శ్రీను, గజేష్, విష్ణు, అంజి, నరసింహతో పాటు విద్యార్థులు పాల్గొన్నారు.

## పేద ప్రజలకు ప్రభుత్వ ఫలాలు అందించాలి

**ఇటిక్యాల,అక్టోబరు 24 ప్రభాతవార్త :** అర్హులైన పేదవారికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అందించే సంక్షేమ పథకాలు, అలాగే మౌలిక వసతులు కల్పించాలని ప్రతి అధికాని బాధ్యతగా పనిచేస్తూ ప్రజలకు దగ్గర వ్వాలని శిక్షణ అధికారులు మండల స్థాయి అధికారులకు వివరించారు. మానవ వనరుల అభివృద్ధి సంస్థ నుండి 5గురు శిక్షణాధికారులు లోకేష్ యాదవ్, నిఖిత యాదవ్, డింపల్ యాదవ్, బసవరాజు వాలికర్, ఇంద్రజిత్ సిరా ట్రైనింగ్‌లో భాగంగా ఈనెల 21న మండల పరిధిలోని కోదండపురం గ్రామానికి చేరుకున్నారు. రెండవ రోజు గ్రామంలోని అంగన్‌వాడి కేంద్రం ప్రభుత్వ పాఠశాల పల్లెదవాఖానను ప్రభుత్వాల ఆధ్వర్యంలో జరిగే కార్యక్రమాలపై అడిగి తెలుసుకున్నారు. రెండవ రోజు బుధవారం గ్రామ శివారులో పంట పొలాలను పరిశీలించి రైతులతో, కూలీలతో మాట్లాడారు. నాలుగో రోజు గురువారం మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిశీలించి అక్కడ పేద ప్రజలకు అందుతున్న వైద్య సేవలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలలు, విద్యార్థుల మరుగుదొడ్లను పరిశీలించారు. అనంతరం ఎంఈఓలతో సమావేశమై విద్యార్థులు ఉదయం ప్రార్థన సమయంలో రోజుకో కొత్త అంశం మాట్లాడించాలని, పాఠ్యపుస్తకంలో పొందుపరిచిన దిశ యాప్‌ను ఉపాధ్యాయులు తెలుసుకుని విద్యార్థులకు వివరించాలన్నారు. మధ్యాహ్న సమయంలో ప్రాథమిక పాఠశాల చిన్నారులతో కలిసిమధ్యాహ్న భోజనం చేశారు.అనంతరం మండల పరిషత్ కార్యాలయానికి చేరుకోగా శిక్షణ అధికారులకు ఎంపిడిఓ మహ్మద్ హాజర్ మోహియుద్దిన్ ఆధ్వర్యంలో వారిని ఘనంగా సన్మానించారు. అనంతరం సమావేశపు హాల్‌లో ఆయా శాఖల అధికారులతో సమావేశం అయ్యారు. సందర్భంగా పలు శాఖల అధికారులు నివేదిక చదివి వినిపించారు. అనంతరం ఐదుగురు శిక్షణాధికారులు మాట్లాడుతూ మూడు రోజులపాటు గ్రామీణ ప్రాంతాలలో పర్యటించి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఆధ్వర్యంలో చేపట్టే పనులు ప్రజలకు అందుతున్న పథకాలు మౌలిక వసతులు, రైతుల సమస్యలు, ఉపాధిహామీ పథకం కింద కోదండపురంలో కూలీల వివరాలు, జాబ్ కార్డుల పంపిణీ, వ్యక్తిగత మరుగుదొడ్ల నిర్మాణం వంటివి పరిశీలించామని ఇక్కడి ప్రజల నుండి చాలా నేర్చుకున్నామని వివరించారు. ప్రతి అధికారి తమ శాఖల ద్వారా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఆధ్వర్యంలో చేపట్టే పనులపై గ్రామీణ ప్రాంతాల్లోని ప్రతి పేదవారికి అందేలా చూడాలని ప్రజలను చైతన్య పరచాలని మహిళా సంఘాలను పూర్తి స్థాయిలో బలోపేతం చేయాలని అధికారులకు వివరించారు. ఎంపిడిఓ మొహ్మద్ అజార్, మొహియుద్దిన్, తహసిల్దార్ నరేందర్, మండల విద్యాశాఖ అధికారులు వెంకటేశ్వర్లు, అప్సర్ పాషా, ఆయా శాఖల అధికారులు పాల్గొన్నారు.

# రైతులను నట్టేట ముంచిన ప్రభుత్వం

◆ బీఆర్ఎస్ పార్టీ జిల్లా అధికార ప్రతినిధి వాకిటి శ్రీధర్


సమావేశంలో మాట్లాడుతున్న బీఆర్ఎస్ జిల్లా అధికార ప్రతినిధి వాకిటి శ్రీధర్

**గోపాల్‌పేట అక్టోబరు 24 ప్రభాతవార్త:** గోపాల్‌పేట మండల రైతాంగ ప్రజా నిరసన సదస్సు సన్నాహక సమావేశం గురువారం రోజు మండల పార్టీ అధ్యక్షులు బొల్లెద్దుల బాలరాజు అధ్యక్షతన మండల కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో జరిగింది. ఈ సమావేశములో పాల్గొన్న జిల్లా అధికార ప్రతినిధి వాకిటి శ్రీధర్ మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ అమలు కాని హామీలు ఇచ్చి రైతులను నట్టేట ముంచారు అని మిగతా వర్గాలకు ఇచ్చిన హామీలు కూడా అమలు చేయడం లేదని ప్రజలు చాలా ఆగ్రహంగా ఉన్నారు అని అన్నారు. ప్రధాన ప్రతిపక్షంగా మాజీ వ్యవసాయ శాఖ మంత్రి నిరంజన్‌రెడ్డి ఆధ్వర్యంలో రాష్ట్రములోనే మొట్టమొదటగా ప్రజల తరపున పోరాడడానికి మాజీ మంత్రివర్యులు హరీష్‌రావు ముఖ్య అతిథిగా వనపర్తిలో రైతాంగ ప్రజా నిరసన సదస్సు నిర్వహిస్తున్నామని తెలిపారు. మండల కమిటీ ప్రతి గ్రామాన్ని సందర్శించి రైతులను ప్రజలను సన్నద్ధం చేసి సభ విజయ వంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో కురుమూర్తి యాదవ్, తిరుపతయ్య యాదవ్, చంద్రశేఖర్,మతీన్, మణ్యా నాయక్,వడ్డేగోపాల్, హార్యనాయక్, వడ్డేమాన్ రవి, నాగరాజు,జహంగీర్,బాల్‌రెడ్డి, వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

కార్పొరేట్లకు రాయితీ ఇస్తూ

# పేదలపై భారం మోపుతున్న కేంద్ర ప్రభుత్వం

◆ సిపిఎం జిల్లా కార్యదర్శి దేశనాయక్


మహాసభలో మాట్లాడుతున్న దేశనాయక్

**ఉప్పునుంతల,అక్టోబరు 24 ప్రభాతవార్త:** కేంద్రంలో ఉన్న బిజెపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుండి పెట్టుబడిదారులకు, కార్పోరేట్లకు లక్షల కోట్ల రూపాయలు రాయితీలు ఇస్తూ పేద ప్రజలపై భారం మోపుతుందని సిపిఎం పార్టీ జిల్లా కార్యవర్గ సభ్యులు దేశనాయక్ అన్నారు. గురువారం మండలంలోని కంసానిపల్లి గ్రామంలో సిపిఎం పార్టీ నాలుగో మండల మహాసభలు శ్రీరాములు అధ్యక్షతన జరిగింది. ఈ సభకు సిపిఎం జిల్లా కార్యవర్గ సభ్యులు దేశనాయక్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశంలో బిజెపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే ఆదాని, అంబానీ, టాటా బిర్లా బడా పెట్టుబడిదారులకు ఇప్పటివరకు రూ.13 లక్షల కోట్లు రాయితీలు ఇచ్చిందని, దీంతో పేద ప్రజలకు, కార్మికులకు భారం మోపడం కేంద్ర ప్రభుత్వానికి తగదన్నారు. పదేళ్ల కాలంలో పేద ప్రజలకు ఏ ఒక్క సంక్షేమ పథకాలు అమలు చేయలేదని, కుల మతాల మధ్య విద్వేషాలు రేపుతూ రాజకీయంగా రాజ్యమేలుతుందని రాజ్యాంగాన్ని తూట్లు పొడవడమే అన్నారు. రాజ్యాంగాన్ని కాపాడుకోవాలంటే దేశ ప్రజలు ఐక్యంగా పోరాటి బిజెపి ప్రభుత్వాన్ని రాబోయే కాలంలో ఎదుర్కోవడమే గొప్ప కర్తవ్యమని ఆయన పేర్కొన్నారు. దేశంలో బిజెపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఉపాధి,ఉద్యోగ అవకాశాలు రోజు రోజుకు యువకులకు,కార్మికులకు దూరం అవుతున్నాయని, కొత్త పరిశ్రమలు నెలకొల్పి యువతకు ఉపాధి కల్పించే విషయంలో కేంద్ర ప్రభుత్వం పూర్తిగా వెనుకబడ్డారని ఆయన ఆరోపించారు. కేంద్ర ప్రభుత్వం ప్రభుత్వ రంగ సంస్థలను చౌకగా బడా కార్పోరేట్ శక్తులకు కట్టబెట్టడం దుర్మార్గమైన చర్యని అన్నారు. ప్రభుత్వ రంగ సంస్థలను కాపాడుకోవడం కోసం సిపిఎం ఆధ్వర్యంలో ఆందోళన, పోరాటాలు, పెద్ద ఎత్తున రాబోయే కాలంలో నిర్వహిస్తామని ఆయన హెచ్చరించారు. దేశ భవిష్యత్తు చదువుపై ఆధారపడి ఉందని చదువును శాస్త్రీయపరంగా ఆలోచించకుండా శాస్త్రీ విద్యా విధానం తీసుకురావాలని ఆందోళన చేయడం కేంద్ర ప్రభుత్వానికి తగదని శాస్త్రీయ సాంకేతిక అంశాలపై మేధావులు, విద్యావంతులు, యువకులు ఆలోచన చేయాలన్నారు. ఈ మహాసభలో సిపిఎం పార్టీ జిల్లా నాయకులు మల్లేష్, శంకర్‌నాయక్, తాలూకా నాయకులు బృంగి రాములు, శివకుమార్, మండల కార్యదర్శి చింతల నాగరాజు, మండల నాయకులు శ్రీరాములు, హుస్సేన్, మల్లయ్య, వెంకటయ్య, చంద్రయ్య, నాగయ్యగౌడ్, కిష్టయ్య, జంగయ్య తదితరులు పాల్గొన్నారు.

# లక్ష్యాన్ని పూర్తి చేసేలా డీలర్లు కృషి చేయాలి


రేషన్ డీలర్లతో చర్చిస్తున్న జూనియర్ అసిస్టెంట్ అబ్రహార్

**ఉప్పునుంతల,అక్టోబరు 24 ప్రభాతవార్త :** మండలంలో పిడిఎస్ రేషన్ డీలర్లు ఈకెవైసి పూర్తి చేయాలని రేషన్ డీలర్ల సమీక్ష సమావేశంలో ఉప తహసిల్దార్ కేశవ్ సూచించారు. గురువారం స్థానిక తహసిల్దార్ కార్యాలయంలో మండలంలోని రేషన్ డీలర్ల సమీక్ష సమావేశం జరిగింది. ఈకెవైసి చేయించడంలో కొంత మంది డీలర్లుఅలసత్వం వహిస్తున్నారని, ఇచ్చిన టార్గెట్ ప్రకారం 95 శాతం పూర్తి చేయాలని డీలర్లకు సూచించారు. ఇప్పటివరకు మండలంలో 70 నుంచి 80 శాతం మధ్య ఈకెవైసి చేశారని, వేగవంతంగా ఈ నెలలో 95 శాతం పూర్తి చేయాలని కోరారు. ఈ సమావేశంలో ఉప తహసిల్దార్ కేశవ్, జూనియర్ అసిస్టెంట్ అబ్రహార్,రేషన్ డీలర్ల సంఘం అధ్యక్షుడు, రేషన్ డీలర్ల సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి పాపిశెట్టి కుమారస్వామి, మల్లయ్య, సత్యనారాయణ,కృష్ణయ్య,వేణుగోపాల్ తదితరులు పాల్గొన్నారు.

## జల్ శక్తి అభినయ్ కార్యక్రమాన్ని అన్ని శాఖలు సామన్వయంతో పని చేయాలి

జల్ శక్తి అభినయ్ టెక్నికల్ అధికారి బి.జె మధుసూదన్


జల్ శక్తి వీడియో కాన్ఫరెన్స్ మాట్లాడుతున్న టెక్నికల్ అధికారి మధుసూదన్

**గద్వాల అక్టోబరు 24 ప్రభాతవార్త :** గురువారం కలెక్టర్ కార్యాలయంలోని వీడియో కన్ఫరెన్స్ హాల్ నందు జల్ శక్తి అభినయ్ క్యాచ్ ది రేయిన్- 2024 నారీ శక్తి సే జలశక్తి అనే ప్రతివృత్తంతో నిర్వహించిన సమావేశంలో అదనపు కలెక్టర్ నర్సింగా రావులో కలిసి ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జల్ శక్తి అభినయ్ కార్యక్రమాన్ని విజయవంతం చేయడం కోసం అన్ని శాఖలు సమన్వయంతో పని చేయాలన్నారు. మార్చి నుండి నవంబర్ 24 వరకు నిర్వహించే ప్రత్యేక కార్యక్రమంలో మహిళలను భాగస్వాములు చేయాలని ఆయన సూచించారు. .జిల్లాలో జల్ శక్తి అభినయ్ క్రింద జిల్లాలో చేపట్టిన పనులను మూడు రోజుల పాటు అధికారులతో కలిసి క్షేత్రస్థాయిలో పరిశీలిస్తామని అన్నారు. జిల్లాలో ఇప్పటి వరకు చేపట్టిన పనులపై ఇరిగేషన్, గ్రౌండ్ వాటర్,వ్యవసాయ శాఖ, మిషన్ భగీరథ, జిల్లా గ్రామీణ అభివృద్ధి సంస్థ, అటవీశాఖ అధికారులు పీపీటీ ద్వారా ప్రజెంటేషన్ ఇవ్వడం జరిగినది. పిపిటి ప్రజెంటేషన్ ద్వారా అధికారులు చూపించిన అభివృద్ధి పనులను సమీక్షించి ఆయన సంతృప్తి వ్యక్తం చేశారు.ఈ కార్యక్రమంలో ఉద్యాన శాఖ అధికారి అక్బర్ బాషా,డిపిఓ శ్యాంసుదర్, మిషన్ భగీరథ ఇంట్రా శ్రీధర్ రెడ్డి, ఇరిగేషన్ ఈ.ఈ. రహీముద్దీన్, గ్రౌండ్ వాటర్ ఆఫీసర్ మోహన్, జెడ్పిసీఈఓ కాంతమ్మ,ఈ.ఈ పి. ఆర్ దామోదర్‌రావు, మున్సిపల్ కమిషనర్లు తదితరులు పాల్గొన్నారు.

# ఎస్సీ ఉపకులాలకు ధ్రువీకరణ పత్రాలు ఇవ్వాలి


ఆర్డీఓ, ఎమ్మార్వోలకు వినతిపత్రం ఇస్తున్న ఎస్సి ఉపకులాల అధ్యక్షులు రాంచంధర్

**గద్వాల అక్టోబరు 24 ప్రభాతవార్త :** ఉమ్మడి మహబూబ్ నగర్ జిల్లా ఎస్సీ 57 ఉపకులాలు అధ్యక్షులు హెచ్‌డి ఆకుల రామ చందర్ ఆధ్వర్యంలో ఆర్డీవోని, ఎమ్మార్వోని కలవడం జరిగిందన్నారు. జోగులాంబ గద్వాల జిల్లాలో ఎస్సీలు 57 ఉపకులాలు నివసిస్తున్నారని, ఇందులో ఏ కులం వాళ్ల కులం సంఘం లెటర్ ప్యాడ్ తీసుకొస్తే మాత్రమే సర్టిఫికెట్ ఇవ్వవలసిందిగా విజ్ఞప్తి చేశాం అని రాంచంధర్ అన్నారు. ఎందుకనగా ఎంతో మంది దొంగ సర్టిఫికెట్లు రాజకీయ నాయకులను పట్టుకుని తీసుకుంటున్నాందుకు ఆర్డీవో గ ఎమ్మార్వోలు నిజమైన ఎస్సీ లబ్ధిదారులకు మాత్రమే సర్టిఫికెట్ ఇవ్వాల్సినదే విజ్ఞప్తి చేస్తున్నాం అన్నారు. అలాగే ఎల్లమ్మల వాడ్లు ఎప్పటినుంచో గద్వాల పట్టణంలో నివసిస్తున్నారు అన్నారు. వాళ్లకు సర్టిఫికెట్ లేవని కావున వాళ్ల కులం గురించి ఎంక్వయిరీ చేసి తొందరగా వాళ్లకు సర్టిఫికెట్ ఇచ్చే విధంగా ఆర్డీవో ఎమ్మార్వోలను కోరడం జరిగినదన్నారు. అందుకు ఎమ్మార్వో, ఆర్డీవోలు స్పందించి ఎల్లమ్మ వాళ్ళ సమస్యను తొందరగా పరిష్కరిస్తామని హామీ ఇవ్వడం జరిగినదన్నారు. విజ్ఞప్తి కార్యక్రమంలో హోలియో దాసరిసంక్షేమం సంఘం ఎల్లమ్మ వాళ్ళ సంఘం పెద్ద ఎత్తున పాల్గొనడం జరిగినదన్నారు.

## ఎబివిపి ధర్నా ఉద్రిక్తం

### ఫీజు రీయింబర్స్‌మెంట్ వెంటనే విడుదల చేయాలని డిమాండ్


విద్యార్థులకు నచ్చజెబుతున్న సిఐ ఆదిరెడ్డి, ఎస్సైలు

**జడ్చర్ల,అక్టోబరు 24 ప్రభాతవార్త:** ఫీజు రియాంబర్స్‌మెంట్ విడుదల చేయాలంటూ ఎబివిపి ఆధ్వర్యంలో చేపట్టిన ధర్నా కార్యక్రమం ఉద్రిక్తంగా మారింది. విద్యార్థులకు ఫీజు రియాంబర్స్‌మెంట్ వెంటనే విడుదల చేయాలని ఎబివిపి నాయకులు విద్యార్థులు కదం తొక్కారు. గురువారం జడ్చర్ల పట్టణంలోని నేతాజీ చౌరస్తాలో పెద్ద ఎత్తున ఆందోళన చేపట్టారు. అనంతరం రోడ్డుపై బైఠాయించి ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేపట్టారు. దీంతో నాగర్‌కర్నూల్ ప్రధాన ర,చహదారిపై ట్రాఫిక్ జామ్ అయింది. దీంతో పోలీసులు రంగప్రవేశం చేసి ఎబివిపి నాయకులను చెదరగొట్టారు. విద్యార్థులకు ఎబివిపి నాయకులకు ఎంత నచ్చజెప్పినా అలాగే బైఠాయించారు. పెండింగ్ రూ.5 వేల కోట్ల రియాంబర్స్‌మెంట్ వెంటనే విడుదల చేసే వరకూ కదిలేది లేదని భీష్మించారు. ఈ సందర్భంగా మహబూబ్‌నగర్ జిల్లా ఎబివిపి కన్వీనర్ సతీష్ మాట్లాడుతూ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాది కావస్తున్నా విద్యారంగ సమస్యలు పరిష్కరించడం లేదని విద్యా రంగ సమస్యల పట్ల పూర్తిగా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుందని గత మూడు సంవత్సరాల నుంచి విద్యార్థులకు స్కాలర్‌షిప్‌లు అందక ఇబ్బంది పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. సమస్యలను వెంటనే పరిష్కరించాలని లేనిపక్షంలో ఎబివిపి ఆధ్వర్యంలో ఆందోళన మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. చివరకు సిఐ ఆదిరెడ్డితో పాటు ఎస్సైల జోక్యంతో ఎబివిపి నాయకులు ఆందోళన విరమించారు. కార్యక్రమంలో నియోజకవర్గ ఎబివిపి నాయకులు, విద్యార్థులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## మధ్యాహ్న భోజన పథకాన్ని పరిశీలించిన ఎంఈఓ

**నారాయణపేట టౌన్,అక్టోబరు 24 ప్రభాతవార్త:** దామరగిద్ద మండలం విఠలాపూర్ గ్రామం ప్రాథమిక పాఠశాలను గురువారం మండల విద్యాశాఖ అధికారి కృష్ణారెడ్డి సందర్శించి మధ్యాహ్న భోజన పథకాన్ని పరిశీలించారు. చదువులో విద్యార్థుల నైపుణ్యాన్ని పరిశీలించారు. నాణ్యతతో మధ్యాహ్న భోజన పథకాన్ని అందించాలని వంట నిర్వాహకులకు సూచించారు. అనంతరం రికార్డులు పరిశీలించారు. కొత్తగా నియమితులైన ఉపాధ్యాయుల అభిప్రాయాలను తెలుసుకున్నారు.ఎంఈఓ వెంట పాఠశాల సిబ్బందితో పాటు తదితరులు ఉన్నారు.

## నిర్వాసితులకు ఆర్అండ్ఆర్ కాలనీ నిరిస్తాం

◆ నాగర్‌కర్నూల్ జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్


నిర్వాసితుల సమస్యలు తెలుసుకుంటున్న కలెక్టర్

**కొల్లాపూర్,అక్టోబరు 24 ప్రభాతవార్త:** పాలమూరు రంగారెడ్డి భూ నిర్వాసితులకు రాష్ట్ర ప్రభుత్వం, జిల్లా యంత్రాంగం పూర్తి స్థాయిలో అండగా ఉంటుందని ముంపు గ్రామాల ప్రజలు ఎవరు అధైర్యపడొద్దని నాగర్‌కర్నూల్ జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్ అన్నారు. గురువారం కొల్లాపూర్ మండలంలోని ఎర్రగుట్ట, బొల్లారం తండా, వడ్డె గుడిసెలు, అంజన్నగిరి, బోరబండ తండా, వడ్డె గుడిసెలు, అంజన్నగిరి, బోరబండ తండా, దూల్యానాయక్ తండా గ్రామాలు పాలమూరు రంగారెడ్డి ఎత్తిపోతల పథకంలో భాగంగా నిర్మిస్తున్న రిజర్వాయర్‌లో ముంపునకు గురవుతున్న గ్రామస్తులను రాష్ట్ర పర్యాటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు సూచనల మేరకు జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్ సందర్శించి, గ్రామస్తులతో కలిసి ముంపు ప్రాంతాలను పరిశీలించి సమస్యలను కలెక్టర్ గుర్తించారు. ముంపుకు గురవుతున్న ఆయా గ్రామాల ప్రజల అవసరాలు, పునరావాసానికి కావలసిన సదుపాయాలు తదితర అంశాలపై సుదీర్ఘంగా చర్చించారు. ముంపు గ్రామాల ప్రజలకు ప్రభుత్వం తరపున అన్ని సదుపాయాలు కల్పించి మంచి ఆర్అండ్ఆర్ కాలనీని నిర్మించి, ఆ కాలనీలో ప్రభుత్వ పాఠశాల, ప్రాథమిక ఆసుపత్రి, విశాలమైన సిసి రోడ్లు, అండర్ డ్రైనేజీ, కమ్యూనిటీ హాల్ నిర్మాణాలతో పాటు ప్రజలకు అవసరమైన అన్ని రకాల మౌలిక సదుపాయాలను కల్పించడం జరుగుతుందని, అందుకు మంత్రితో పాటు జిల్లా యంత్రాంగం పూర్తి స్థాయిలో నిర్వాసితులకు అండగా ఉంటామని కలెక్టర్ ఈ సందర్భంగా గ్రామస్తులకు వివరించారు. గ్రామస్తులు తమకు ఇల్లు కట్టుకునేందుకు నివాస స్థలాలకు పట్టాలు ఇవ్వాలని,ఫారెస్టు అధికారుల నుంచి ఎలాంటి ఇబ్బందులు రాకుండా చూడాలని, ముంపులో కోల్పోయిన భూములకు భూములు ఇచ్చే విధంగా చూడాలని రైతులు, గ్రామస్తులు కలెక్టర్‌కు విన్నవించుకున్నారు. 125,176 సర్వే నంబర్ రైతులకు తగిన పరిహారం చెల్లించాలని రైతులు కలెక్టర్‌ను కోరారు. ఎర్రగట్టు, బొల్లారం గ్రామంలో ఫారెస్టు అధికారులతో కలిసి గ్రామస్తులు ఎదుర్కొంటున్న సమస్యలను ఫారెస్టు భూమి వివరాలను కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. గ్రామంలో 64 కుటుంబాలు నివసిస్తున్నాయని, ఇండ్ల నిర్మాణాన్ని ఫారెస్టు అధికారులు అడ్డుకుంటున్నారని, ఈ సందర్భంగా కలెక్టర్‌కు పలువురు గ్రామస్తులూరం ఆర్అండ్ఆర్ కాలనీకి షిఫ్టింగ్ కావాలని గ్రామస్తులకు కలెక్టర్ తెలియజేశారు. అంతకు ముందు తమ గ్రామానికి సందర్శించి వచ్చిన జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్‌ను ఆయా గ్రామాల ప్రజలు పుష్పగుచ్చం,శాలువాతో సత్కరించారు. కలెక్టర్ వెంట కొల్లాపూర్ ఆర్డీఓ యాదగిరి, తహసిల్దార్, వివిధ శాఖల అధికారులు, కొల్లాపూర్ మాజీ జడ్పీటిసి హనుమంతు నాయక్, ఆయా ముంపు గ్రామాలకు సంబంధించిన ప్రజలు తదితరులు ఉన్నారు.

## తెలంగాణలో ఒకే పోలీస్ వ్యవస్థ ఉండాలి

**ఇటిక్యాల,అక్టోబరు 24 ప్రభాతవార్త:** తెలంగాణలో కర్ణాటక, తమిళనాడు తరహాలోనే ఒక పోలీస్ వ్యవస్థ ఉండాలని బెటాలియన్‌లో శ్రమదోపిడి ఉందని తమ భర్తలను ఇతర ప్రాంతాలకు డ్యూటీలు వేస్తూ మాకు పిల్లలకు దూరంగా ఉండాల్సిన పరిస్థితి నెలకొందని అందుకు బెటాలియన్‌లో పనిచేసే కానిస్టేబుళ్లకు కూడా సివిల్ ఏఆర్ పోలీస్ శాఖ నిబంధనలు అమలు చేయాలని డిమాండ్ చేస్తూ గురువారం సాయంత్రం మండల పరిధిలోని ఎర్రవల్లి చౌరస్తా జాతీయ రహదారిపై మహిళా కుటుంబ సభ్యులు బైఠాయించి నిరసన తెలిపారు. గంటపాటు నినాదాలు చేస్తూమహిళలు రోడ్డుపై బైఠాయించారు. స్థానిక ఎస్సై వెంకటేష్, కోదండపూర్ ఎస్సై స్వాతి వారికి రహదారిపై బైఠాయించరాదని రహదారి నిబంధనలు విరుద్ధమని ఎంత నచ్చజెప్పిన ఒకే పోలీస్ వ్యవస్థ అంటూ నినాదాలు చేస్తూ నిరసన తెలిపారు. సంబంధిత బెటాలియన్ కమాండెంట్ వినతి పత్రం ఇచ్చేందుకు నేను తీసుకువెళ్తానని రహదారిపై నిరసన చేయరాదని రోడ్డుపై అంబులెన్స్‌లు ఇతర వాహనాలకు ఇబ్బందులు కలుగుతాయని మహిళలకు సర్ది చెబుతున్న వారు వినకపోవడంతో కొంతసేపు ఉద్రిక్తత నెలకొంది. దాదాపు 40 నిమిషాలకు పైగా రోడ్డుపై నిరసన తెలిపారు. మళ్లీ ఫ్లెక్సీలు పెటుకొని నిరసన తెలుపుతుండగా సమాచారం తెలుసుకున్న శాంతి నగర్ సిఐ టాటా బాబు అక్కడికి చేరుకుని మహిళలను సముదాయించి జాతీయరహదారిపై నిరసన ధర్నాలు చేస్తే కఠిన చర్యలు ఉన్నాయనిమీరు ఇబ్బందులుపడతారని మహిళలకు నచ్చజెప్పారు. పదవ బెటాలియన్ కమాండెంట్‌ను కల్పించి వారికి మీ డిమాండ్లను వినిపించేలా మాట్లాడిస్తామని మహిళలకు అక్కడి నుండి తీసుకువెళ్లారు. జాతీయ రహదారిపై మహిళలు నిరసన తెలపడంతో అరగంట పాటు ట్రాఫిక్‌కు ఇబ్బందులు ఏర్పడ్డాయి.

## వరి కొనుగోళ్లపై సమీక్షించిన కలెక్టర్

**నారాయణపేట టౌన్,అక్టోబరు24 ప్రభాతవార్త:** ఖరీఫ్ వానాకాలం 2024కు గాను వరిధాన్యం కొనుగోళ్లపై గురువారం సాయంత్రం కలెక్టరేట్‌లోని విసి హాల్లో జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్ సమీక్ష జరిపారు. జిల్లాలో ఇప్పటివరకు ఎన్ని కొనుగోలు కేంద్రాలు ప్రారంభించారని, ఇంకా ఎన్ని కేంద్రాలను ప్రారంభించాల్సి ఉందని అధికారులను అడిగి తెలుసుకున్నారు. నిర్దేశించిన లక్ష్యం మేరకు కొనుగోలు కేంద్రాల ద్వారా ధాన్యాన్ని సేకరించాలన్నారు. ఈసారి సన్నరకం వరి ధాన్యానికి ప్రభుత్వం అదనంగా రూ. 500 బోనస్ పెంచిందని సన్నరకం ధాన్యం సేకరణలో అధికారులు నిబంధనలను పాటించాలని సూచించారు. ఈసారి బోనస్ వస్తుండడంతో కొనుగోళ్లు పెరిగే అవకాశం ఎక్కువగా ఉంటుందని, ఎంతో పారదర్శకంగా, నిబంధనల ప్రకారం సన్నరకం ధాన్యాన్ని కొనుగోలు చేయాల్సి ఉంటుందన్నారు. కొనుగోలు కేంద్రాల నిర్వహణకు అవసరమైన డిజిటల్ మైక్రో మీటర్స్,టార్పాలిన్లు, ఎలక్ట్రానిక్ కాంటాలు, గన్ని బ్యాగులు వచ్చాయా?లేదా? అని మార్కెట్ కార్యదర్శి భారతిని అడిగారు. ప్రస్తుతం 1120 టార్పాలిన్లు అందుబాటులో ఉన్నాయని, అదనంగా ఇంకా 2620 జిల్లాకు వస్తున్నాయని మార్కెట్ కార్యదర్శి కలెక్టర్‌కు తెలిపారు. అన్ని ఎలక్ట్రానిక్ కాంటాలకు తూనికల కొలతల శాఖ అధికారుల స్టాంపింగ్ పూర్తి చేయించాలని కలెక్టర్ ఆదేశించారు. కేంద్రాల నిర్వహణకు ఇంకా ఏమైనా అవసరం ఉంటే ఇండెంట్ పెట్టి తెప్పించుకోవాలని అధికారులకు సూచించారు. ఈ సమీక్షలో జిల్లా రెవెన్యూ అదనపు కలెక్టర్ అశోక్‌కుమార్, సివిల్ సప్లై డిఎం దేవదాస్, జిల్లా సివిల్ సప్లై అధికారి సుదర్శన్, జిల్లా వ్యవసాయశాఖ అధికారి జాన్ సుధాకర్, అదనపు డిఆర్‌డిఒ అంజయ్య, సింగిల్ విండో అధికారులు పాల్గొన్నారు.



అధికారులతో సమీక్షిస్తున్న కలెక్టర్

Main-IV(MDK):Main-IV(MDK).qxd 10/24/2024 8:01 AM Page 1



## మట్టి-ఇసుక తొలగింపులతో ప్రమాదాలు



రోడ్డుమీద మట్టిని ఎత్తిపోస్తున్న పారిశుద్ధ్య సిబ్బంది

**రామాయంపేట, అక్టోబర్ 24, ప్రభాతవార్త:** రామాయంపేట మున్సిపాలిటీ కేంద్రంలో సిద్ధిపేట చౌరస్తా వద్ద రహదారిపై ఉన్న చెత్తా చెదారాన్ని, మట్టిని తొలగించారు. జనతా హోటల్ నుండి సిద్ధిపేట చౌరస్తా వరకు ప్రధాన రహదారిపై ఇరుపక్కల ఇసుకతో పాటు మట్టి పేరుకుపోయింది. ఈ రహదారి వెంట వెళ్లే ద్విచక్ర వాహనదారులు ప్రతిరోజు తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు. పెద్దపెద్ద వాహనాలు వెళ్లడం, దీంతో దుమ్ము రేగడం, వెనుక ఉన్న ద్విచక్ర వాహనదారుల కళ్లల్లో మట్టి పడడంతో ఒక సందర్భంలో ప్రమాదాలు కూడా జరిగాయి. సిద్ధిపేట చౌరస్తా వద్ద దుమ్మురేగి ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని ప్రభాతవార్త విలేకరి స్థానిక మున్సిపల్ చైర్మెన్ పల్లె జితేందర్‌గౌడ్ దృష్టికి తీసుకుపోవడంతో ఆయన స్పందించి గురువారం ఉదయం మున్సిపల్ కార్మికులను అక్కడికి పంపించి, చెత్తా చెదారాన్ని తొలగించారు. దీంతో కొంతవరకు సమస్య తీరినట్లు అయింది.

## విద్యుత్ షాక్ తగిలి రైతు మృతి

**రామాయంపేట, అక్టోబర్ 24, ప్రభాతవార్త:** రామాయంపేట మండలం ఝాన్సీలింగాపూర్ గ్రామంలో విద్యుత్ షాక్‌తో యువరైతు మృతిచెందిన సంఘటన చోటుచేసుకుంది. ఝాన్సీలింగాపూర్ గ్రామానికి చెందిన చాకలి నాగరాజు (38) అనే యువకుడు గురువారం ఉదయం తన వ్యవసాయ పొలం బోరు వద్దకు వెళ్లడం జరిగింది. పొలం వద్ద విద్యుత్ తీగ తెగిపోవడంతో స్టార్టర్ సరిచేస్తున్న క్రమంలో ప్రమాదవశాత్తు విద్యుత్ షాక్ తగిలి అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడికి ఇద్దరు కుమారులు, ఒక కుమార్తె ఉన్నారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు రామాయంపేట ఎస్సై బాలరాజ్ కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

## సిపిఎం పార్టీ జిల్లా నేత మృతి

**రామాయంపేట, అక్టోబర్ 24, ప్రభాతవార్త:** రామాయంపేట మున్సిపాలిటీ పరిధిలోని గొల్పర్తి గ్రామానికి చెందిన సిపిఎం పార్టీ నాయకుడు లింగోల్ల సత్యం గత కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నాడు. ఆస్పత్రిలో చికిత్స పొందుతూ బుధవారం సాయంత్రం చనిపోయాడు. గతంలో సత్యం సిపిఎం పార్టీలోను, సిఐటియూలో అనేక ఉద్యమాలలో పనిచేశాడు. అలాగే సిపిఎం పార్టీ జిల్లా కమిటీ సభ్యునిగా కూడా ఆయన పనిచేశారు. అదేవిధంగా కార్మిక సంఘాలలో కార్మికుల కోసం, అంగన్వాడి సమస్యల కోసం జరిగిన ఉద్యమాలలో పాల్గొన్నారు. ప్రజాసమస్యల కోసం పోరాటం చేసిన కామ్రేడ్‌గా రామాయంపేట మండలంలోనే కాకుండా జిల్లాలో ఆయన అలుపెరుగని పోరాటాలు చేశారని, ఆయన చేసిన సేవలు మరువలేమని పార్టీ నాయకులు తెలిపారు. ప్రత్యేక తెలంగాణ ఉద్యమంలో కీలకపాత్ర పోషించారు. బీడీ కార్మికుల సమస్యల కోసం జరిగిన ఆందోళనలు, ప్రభుత్వవ్యతిరేక ఉద్యమంలో ఆయన ప్రజలపక్షాన ముందు నిలబడి నడిపించేవారని ప్రజలు చెబుతున్నారు. అసంఘటిత కార్మికులకు బాసటగా నిలిచి లేబర్ ఐడి కార్డులు, ప్రమాద బీమా సౌకర్యాలు కల్పించుటలో ఆయన చేసిన కృషి అనన్య సామాన్యమైనదని తోటి కార్మికులు తెలిపారు. ఆయన మరణం పీడిత అసంఘటిత కార్మికులకు, పార్టీకి తీరని లోటని పలువురు వ్యాఖ్యానించారు.

## డిజిటల్ క్రాప్ సర్వే ప్రారంభం

**రామాయంపేట మున్సిపాలిటీ, అక్టోబర్ 24, ప్రభాతవార్త:** రాష్ట్ర స్థాయి వ్యవసాయ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు గురువారం రామాయంపేట వ్యవసాయ డివిజన్ పరిధిలో డిజిటల్ క్రాప్ సర్వే ప్రారంభించినట్లు రామాయంపేట ఇంఛార్జ్ సహాయవ్యవసాయ సంచాలకులు రాజ్‌నారాయణ తెలిపారు. ఈ సందర్భంగా రామాయంపేటలో నిర్వహిస్తున్న డిజిటల్ క్రాప్ సర్వేను పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రామాయంపేట వ్యవసాయ డివిజన్ వ్యాప్తంగా 14 క్లస్టర్లలో వ్యవసాయ విస్తీర్ణాధికారులు క్షేత్రస్థాయిలో రైతుల యొక్క సర్వే నంబర్లు, సబ్ డివిజన్లవారీగా డిజిటల్ పంట నమోదు కార్యక్రమాన్ని చేపట్టారన్నారు. ప్రత్యేకంగా రూపొందించినటువంటి యాప్ ద్వారా డిజిటల్ క్రాప్ సర్వే నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. క్షేత్రస్థాయిలో ఏర్పడినటువంటి వివిధ సాంకేతికపరమైన ఇబ్బందులను ఉన్నతస్థాయి అధికారులకు తెలియజేయడం జరుగుతుందని పేర్కొన్నారు. తద్వారా క్లస్టర్‌వారీగా మండలాల వారీగా ఎంత విస్తీర్ణంలో పంటలు పండిస్తున్నారు, దిగుబడి అంచనా, వచ్చే సీజన్‌కు సంబంధించి ఎరువులు, విత్తనాల ప్రణాళిక చేసుకోవడానికి ఈ సర్వే ఎంతో ఉపయోగపడుతుందని తెలిపారు.

## బివిఆర్ఐటి కళాశాలలో రక్తదాన శిబిరం

**నర్సాపూర్ అక్టోబర్ 24. ప్రభాతవార్త:** నర్సాపూర్ సమీపంలోని బివిఆర్ఐటి ఇంజనీరింగ్ కళాశాలలో గురువారం ఎన్టీఆర్ ట్రస్ట్ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. ఈ శిబిరాన్ని కళాశాల ప్రిన్సిపాల్ సంజయ్‌దూబె, కళాశాల డైరక్టర్ లక్ష్మీప్రసాద్, ఎస్‌విఐఎస్ డైరక్టర్ రవీంద్రబాబు, హెచ్‌ఓడి డాక్టర్ దశరథరామయ్య, సందీప్‌లు ఈ రక్తదాన శిబిరాన్ని ప్రారంభించారు. ఈ రక్తదాన శిబిరంలో విద్యార్థులు, కళాశాల సిబ్బంది, స్థానికులు అందరు కలిసి సుమారు 250మందికి పైగా రక్తదానం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అనారోగ్యంతో బాధపడుతున్న వారికి సకాలంలో రక్తం అందజేయడమే ఈ కార్యక్రమం ముఖ్యోద్దేశ్యమన్నారు. రక్తదానం వల్ల రక్తం అత్యవసరమైన వారికి, సకాలంలో ప్రాణాలు కాపాడడానికి ఎంతో ఉపయోగపడుతుందని తెలిపారు. ఎన్టీఆర్ ట్రస్ట్ ద్వారా సమాజానికి ఉప యోగపడే కార్యక్రమాలు చేయడం అభినందనీయమని అన్నారు. ఈ రక్తదాన శిబిరాన్ని విజయవంతం చేసిన ప్రతి ఒక్కరికి ఈ సందర్భంగా కృతజ్ఞతలు తెలియజేశారు.

## సిఎంఆర్ఎఫ్ చెక్కును అందచేసిన ఎమ్మెల్యే

**మనూర్, అక్టోబరు 24, ప్రభాతవార్త:** మండల కేంద్రమైన మనూర్ గ్రామానికి చెందిన సుగుణమ్మ అనారోగ్యానికి గురికావడంతో మెరుగైన కార్పోరేట్ చికిత్స అందుకునేందుకు 14వేల 5వందల రూపాయల సిఎంఆర్ఎఫ్ చెక్కును మాజీ ఎమ్మెల్యే మహారెడ్డి భూపాల్‌రెడ్డి గురువారం అందచేశారు. కార్యక్రమంలో బిఆర్ఎస్ మండల అధ్యక్షులు విఠల్‌రావు పాటిల్, మాజీ జడ్పీటిసి సభ్యులు రవీందర్ నాయక్, మాజీ సర్పంచ్‌లు సంగప్ప, పండరి, కురుమ సంఘం తాలుకా ఉపాధ్యక్షులు మల్గొండ, నాయకులు మన్నాన్, అంబాదాస్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## బిజెపి పార్టీ సభ్యత్వానికి అపూర్వ స్పందన



రెడ్డిపల్లిలో బిజెపి సభ్యత్వాన్ని పరిశీలించిన బిజెపి నాయకులు మురళీధర్‌గౌడ్ తదితరులు

**నర్సాపూర్ అక్టోబర్ 24. ప్రభాతవార్త:** నర్సాపూర్ మండలంలోని గ్రామాలలో బిజెపి పార్టీ సభ్యత్వానికి అపూర్వస్పందన లభిస్తుందని బిజెపి నాయకులు మురళీధర్‌గౌడ్ అన్నారు. గురువారం నర్సాపూర్ మండల పరిధిలోని రెడ్డిపల్లి గ్రామంలో బిజెపి నాయకుల అధ్వర్యంలో సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈకార్యక్రమాన్ని బిజెపి నాయకులు మురళీధర్‌గౌడ్ ముఖ్య అతిథిగా పాల్గొని సభ్యత్వ సరళిని పరిశీలించారు. బిజెపి నాయకులు గ్రామాల్లో పర్యటిస్తూ కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం చేపడుతున్న ప్రజా సంక్షేమపథకాలను ప్రజలకు వివరిస్తు సభ్యత్వాన్ని సేకరిస్తున్నారని తెలిపారు.

# కొన్యాల రహదారికి మహర్దశ

## సిఆర్ఆర్‌లో రూ.2.10కోట్లు మంజూరు-రోడ్డు నిర్మాణంతో తీరనున్న ఇక్కట్లు



గుంతల మయంగా మారిన చౌటకూరు-కొన్యాల రోడ్డు దృశ్యం

**చౌటకూరు, అక్టోబరు 24, ప్రభాతవార్త:** మండల కేంద్రమైన చౌటకూరు నుంచి హత్నూర మండలం కొన్యాల, దౌల్తాబాద్ నర్సాపూర్, ప్రాంతాలకు వెళ్లే రోడ్డు నిర్మాణానికి సిఆర్ఆర్ పథకంలో రూ.2.10 కోట్ల రూపాయలు మంజూరయ్యాయి. రోడ్డు నిర్మాణ పనులు పూర్తయితే నర్సాపూర్ వెళ్లేందుకు ఏకంగా 20 కిలోమీటర్ల దూరప్రయాణ భారం తగ్గనుంది. అనేక సంవత్సరాలుగా బండ్ల బాటగా పిలిచే ఈ మూడు కిలోమీటర్ల దారిలో గతంలో బిఆర్ఎస్ ప్రభుత్వం ఫార్మేషన్ రోడ్డు వేసి కంకర రోడ్డుగా నిర్మాణం చేశారు. శాసనసభ ఎన్నికల సందర్భంగా చౌటకూరు గ్రామస్థులు రోడ్డును శాశ్వత దహదారిగా ఏర్పాటు చేస్తే కలిగే ప్రయోజనాలపై కాంగ్రెస్ అభ్యర్థి సి.దామోదర్ రాజనర్సింహా దృష్టికి తీసుకుపోగా, శాసనసభ తలుపులు తట్టేలా చేస్తే రోడ్డు నిర్మాణానికి నిధులు మంజూరు చేయిస్తానని దామోదర్ రాజనర్సింహా ఇచ్చిన హామీ మేరకు రాష్ట్రమంత్రి బాధ్యతలు నిర్వహిస్తున్న దామోదర్ రాజనర్సింహా రోడ్డు నిర్మాణానికి నిధులు మంజూరు చేయించడంలో సఫలీకృతులయ్యారు.

**తగ్గనున్న 20 కిలోమీటర్ల దూర ప్రయాణం...**

ధన్‌రాస్తా రహదారిగా మారితే చౌటకూరు గ్రామస్థులతో పాటు పుల్కల్ మండలంలోని పలు గ్రామాల ప్రజలకు ఎంతగానే ఉపయోగకరంగా ఉంటుంది. కొన్యాల మీదుగా హత్నూర, దౌల్తాబాద్, నర్సాపూర్ ప్రాంతా లకు వెళ్లేందుకు సంగారెడ్డి, జోగిపేటల మీదుగా ప్రయాణించాల్సి ఉండేది. అందోలు-నర్సాపూర్ శాసనసభ నియోజకవర్గాలకు కనెక్టివిటీ ఉండే విధంగా చౌటకూరు-హత్నూర మండలం కొన్యాల గ్రామశివారులో 10 ఏళ్ల కిందట మంజీర నదిపై వంతెనను నిర్మించారు, అయితే చౌటకూరు గ్రామ శివారు భూములు ఈ ధన్‌రాస్తాకు ఇరువైపులా మంజీర నది వరకు విస్తరించి ఉన్నాయి. వ్యవసాయ పనులకు వెళ్తున్న రైతులు, రైతు కూలీలతో పాటు ఇతర ప్రాంతాల ప్రజలు సైతం అవస్థలు పడుతూ వస్తున్నారు. చౌటకూరు నుంచి నర్సాపూర్ వెళ్లాలంటే సంగారెడ్డి వరకు 20 కిలోమీటర్లు ప్రయాణించి అక్కడి నుంచి మరో 30 కిలోమీటర్లు ప్రయాణించాల్సి ఉంది. 25ఫీట్ల రోడ్డుకు ఇరువైపులా ఆరు ఫీట్ల చొప్పున వెడల్పుచేసి కంకర తొక్కించి డాంబరు రోడ్డుగా మార్చనున్నారు.

**పెరగనున్న భూముల ధరలు...**

ధన్‌రాస్తా రోడ్డు నిర్మాణం పనులు పూర్తయితే చౌటకూరు గ్రామ శివారులోని భూముల ధరలు అమాంతం పెరిగే అవకాశాలు ఉన్నాయి. 161వ జాతీయరహదారికి ఆనుకుని ఉన్న వ్యవసాయ భూముల ధరలు ఇప్పటికే ఆకాశానికి అంటుకుని ఉన్నాయి. పుల్‌కల్ మండలంలోని కోడూరు, గొంగ్లూర్ గ్రామాల రోడ్డుకు నిధులు మంజూరయ్యాయి. కోడూరు నుంచి కోడూరు తండా, బొమ్మారెడ్డిగూడెం, హన్మానాయక్ తండా, లక్ష్మీసాగర్ గ్రామాల మీదుగా కొండారెడ్డిపల్లి చౌరస్తా వరకు 7 కిలోమీటర్లు రోడ్డు పునరుద్ధరణకు 4.69 కోట్ల రూపాయలు మంజూరయ్యాయి. గొంగ్లూరు గ్రామం నుంచి గిరిజన తండా వరకు 1.4 కిలోమీటర్ల రోడ్డు పునరుద్దరణకు 98లక్షల రూపాయలు మంజూరయ్యాయి.

**అత్యవసర పనులకు ప్రాధాన్యత...**

ఉమ్మడి పుల్‌కల్ మండలంలోని ఆయా గ్రామాల్లో అత్యవసర పనుల నిర్మాణానికి అధిక ప్రాధాన్యత ఇస్తున్నామని రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖామంత్రి సి. దామోదర్ రాజనర్సింహా పేర్కొన్నారు. గత బిఆర్ఎస్ హయాంలో నియోజకవర్గంలో ఎక్కడా కొత్తరోడ్డు నిర్మాణం చేసిన పాపాన పోలేదన్నారు. రహదారుల పునరుద్దరణకు నిధులు మంజూరు చేయించామన్నారు. ఎన్నికల సందర్భంగా చేసిన హామీలను ఒక్కొక్కటిగా నెరవేరుస్తూ ముందుకు సాగుతున్నామన్నారు.

**కల నెరవేరింది-చౌటకూరు రైతు...**

ధన్‌రాస్తా పూర్తిగా ధ్వంసం కావడంతో అటుగా వ్యవసాయ పొలాలకు వెళ్లేందుకు పడరాని పాట్లు పడుతూ వస్తున్నామని, రోడ్డు నిర్మాణానికి మంత్రి దామోదర్ రాజనర్సింహా నిధులు మంజూరు చేయించడం ఆనందంగా ఉందని, ఎన్నాళ్లగానో కలలుగన్న నిధుల మంజూరుతో తమ కలలకు సాకారం కల్గిందని ఆనందం వ్యక్తం చేశారు.

**మంత్రి కృషితోనే నిధులు మంజూరు...**

రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖామంత్రి సి.దామోదర్ రాజనర్సింహా కృషి మూలంగానే రహదారి నిర్మాణానికి నిధులు మంజూరయ్యాయని చౌటకూరు గ్రామ కాంగ్రెస్ కమిటి అధ్యక్షులు వర్కల రమేష్ ఆనందం వ్యక్తంచేశారు. రోడ్డు నిర్మాణం పనులు పూర్తయితే ఈ ప్రాంతంలో మరింత అభివృద్ధి చెందుతుందన్న ఆశాభావం వ్యక్తంచేశారు. రోడ్డు నిర్మాణానికి నిధులు మంజూరు చేయించిన మంత్రి దామోదర్ రాజనర్సింహాకు, నిధులు మంజూరు చేసిన రాష్ట్ర ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు.

## అత్నూర్‌లో దత్తాత్రేయుడికి ప్రాణప్రతిష్ఠ

**న్యాల్‌కల్, అక్టోబరు 24, ప్రభాతవార్త:** మండలంలోని అత్నూర్ గ్రామం ఆధ్యాత్మిక శోభతో విరాజిల్లుతోంది. గ్రామంలో నూతనంగా నిర్మించిన ఆలయంలో దత్తాత్రేయస్వామి విగ్రహానికి ప్రాణప్రతిష్ఠ పూజా కార్యక్రమాలు నేత్ర పర్వంగా కొనసాగుతున్నాయి. వేద బ్రాహ్మణులు వేదమంత్రాలు వల్లిస్తుండగా పూజా కార్యక్రమాల్లో గ్రామంలోని భక్తులు భక్తిశ్రద్ధలతో పాల్గొంటున్నారు. గ్రామం దిగంబరా దిగంబరా శ్రీపాద వల్లభ దిగంబరా నామస్మరణతో మారుమ్రోగుతోంది. ఆడపడుచులు తమ పిల్లాపాపలతో గ్రామానికి చేరుకోవడంతో గ్రామం ఆడపడుచులతో సందడిగా మారింది. ఈ నెల 25న గ్రామంలో స్వామివారికి పల్లకిసేవ నిర్వహించనున్నట్లు నిర్వాహకులు పేర్కొన్నారు.

## గంజాయి తరలిస్తున్న వ్యక్తి అరెస్టు



పోలీసుల అదుపులో గంజాయి తరలిస్తున్న వ్యక్తి

**ఝరాసంగం, అక్టోబరు 24, ప్రభాతవార్త:** ప్రభుత్వం నిషేధించిన గంజాయిని తరలిస్తున్న వ్యక్తిని అరెస్టుచేసి కేసు నమోదుచేసి రిమాండ్‌కు తరలించినట్లు సిఐ జక్కుల హనుమంతు, ఎస్‌ఐ నరేష్‌లు తెలిపారు. గురువారం ఝరాసంగం పోలీసు ఠాణాలో ఏర్పాటుచేసిన విలేఖరుల సమావేశంలో హనుమంతు, నరేష్ ఇందుకు సంబంధించిన వివరాలు వెల్లడించారు. మండలంలోని బర్దిపూర్ గ్రామంలోని దత్తగిరి ఆశ్రమం సమీపంలో బుధవారం రాత్రికి వాహనాలను తనిఖీ చేస్తున్న తరుణంలో అటుగా మండలంలోని బోపన్‌పల్లి గ్రామానికి చెందిన మ్యాతరి అనిల్ (26) కర్ణాటకలోని బీదర్ పట్టణ శివారు గ్రామమైన షాపూర్ నుంచి ఎండు గంజాయిని (1295 గ్రాములు) తరలిస్తుండగా అనుమానం వచ్చి తనిఖీ చేయగా గంజాయి తరలింపు గుట్టు రట్టయిందన్నారు. నిందితుడిని అదుపులోకి తీసుకుని రిమాండ్‌కు తరలించామన్నారు. ఎండుగంజాయినితో పాటు సెల్‌ఫోన్‌లను స్వాధీనం చేసుకున్నామన్నారు. నిందితుడు కర్ణాటకలోని షాపూర్ గేటు వద్ద బీదర్‌కు చెందిన పునిత్, జాఫర్ అలీల వద్ద గంజాయి కొనుగోలు చేసినట్లు వివరించారు.

## పిసిసి అధ్యక్షుడికి శుభాకాంక్షలు

**మనూర్, అక్టోబరు 24, ప్రభాతవార్త:** టిపిసిసి అధ్యక్షులు మహేష్‌కుమార్ గౌడ్‌ను మెదక్ జిల్లా ఎస్సీ, ఎస్టీ విజిలెన్స్ కమిటిసభ్యులు రాజు నాయక్, మాజీ ఎంపిటిసి ఫోరం అధ్యక్షులు రవీందర్ రవినాయక్, యాచారం శ్రీను నాయక్, గంధారిలు గురువారం మర్యాద పూర్వకంగా కలుసుకుని శాలువాతో సత్కరించి పూలబొకేను అందించి శుభాకాంక్షలు తెలిపారు. పార్టీ బలోపేతానికి తమవంతు సహకారం అందిస్తామని మహేశ్వర్‌గౌడ్‌కు హామీ ఇచ్చారు.

## సిఎంఆర్ఎఫ్ చెక్కులు అందచేసిన ఎమ్మెల్యే

**జహీరాబాద్, అక్టోబరు 24, ప్రభాతవార్త:** జహీరాబాద్ పట్టణానికి చెందిన 9 మంది లబ్ధిదారులకు 2లక్షల 74వేల రూపాయల సిఎంఆర్ఎఫ్ చెక్కులను గురువారం ఎమ్మెల్యే కొనింటి మాణిక్‌రావు అందచేశారు. పట్టణంలోని క్యాంప్ కార్యాలయంలో ఏర్పాటుచేసిన కార్యక్రమంలో గడివీధికి చెందిన అడివయ్యకు 27వేలు, రామ్‌నగర్ వీధికి చెందిన తుకారాంకు 48వేలు, అల్లీపూర్‌కు చెందిన సాం ప్రజ్వల్‌కు 12వేల 5వందలు, ఫ్రెండ్స్ కాలనీకి చెందిన రజియా బేగంకు 20వేలు, చిన్న హైద్రాబాద్‌కు చెందిన తుక్కమ్మకు 33వేలు, ఆనంద్‌నగర్‌కు చెందిన జమీల్‌కు 13వేల 5వందలు, హమాలి కాలనీకి చెందిన వంశీకృష్ణకు 33వేలు, గాంధీనగర్‌కు చెందిన ఆరిఫాబేగంకు 33వేల రూపాయల చెక్కులను ఎమ్మెల్యే మాణిక్‌రావు అందచేశారు. కార్యక్రమంలో ఎస్సీ సెల్ అధ్యక్షులు బండి మోహన్, మాజీ పట్టణ అధ్యక్షులు యాకూబ్, మహిళా నాయకురాలు పద్మజ సత్యం ముదిరాజ్, ముర్తుజా, రామ్‌నగర్ టేకుమట్ల గణేష్, చంద్రయ్య, లవన్, సందీప్, ఫాహీమ్, పాండు ముదిరాజ్, బిక్కు నాయక్, రాజ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## రూ.6.70 లక్షలకు కొత్తపల్లి రైసు మిల్లు



కొత్తపల్లి సొసైటిలో రైసు మిల్లు వేలం పాట నిర్వహిస్తున్న దృశ్యం

**పాపన్నపేట, అక్టోబరు 24, ప్రభాతవార్త:** మండల పరిధిలోని కొత్తపల్లి రైతుసేవాసహకార సంఘం ఆధ్వర్యంలోని రైసుమిల్లును గురువారం వేలం (ఏడాది పాటు నడుపుకునేందుకు) వేశారు. వేలంలో పలువురు వ్యాపారులు పాల్గొని వేలంపాటలో పోటీపడ్డారు. చివరగా 6లక్షల 70వేల రూపాయలకు ఏడాదిపాటు నడుపుకునేందుకు రైసుమిల్లును పాండురంగం దక్కించుకున్నారు. వేలంపాటలో 9మంది మిల్లర్లు పోటీపడ్డారు. కార్యక్రమంలో సొసైటి చైర్మన్ త్యార్ల రమేష్ గుప్తా, సీఈఓ వెంకటేశ్వర్లు, కో-ఆపరేటివ్ అసిస్టెంట్ రిజిస్ట్రార్ ఫయాజుద్దీన్, డైరెక్టర్లు, సీనియర్ అసిస్టెంట్ రవి, మాజీ జడ్పీటిసి సభ్యులు మల్లప్ప, మిల్లర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

## ఓపెన్ గడువు పొడిగింపు

**పాపన్నపేట, అక్టోబరు 24, ప్రభాతవార్త:** ఓపెన్ టెన్త్, ఇంటర్ పరీక్షల ఫీజు చెల్లించేందుకు గడువును పొడిగించినట్లు ఓపెన్ స్టడీ సెంటర్ కో-ఆర్డినేటర్ మహేశ్వర్, అసిస్టెంట్ కో-ఆర్డినేటర్ రియాజ్‌లు తెలిపారు. సెప్టెంబరు 20వ తేదీ వరకు ఫీజు చెల్లింపు గడువు ఉండగా, 200 రూపాయల ఫైన్‌తో ఈ నెల 30వ తారీఖువరకు ఫీజు చెల్లించుకునే అవకాశం కల్పించినట్లు పేర్కొన్నారు. పూర్తి వివరాలకు 9912335581కు లేదా పాపన్నపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను సంప్రతించాలన్నారు.

# మహిళలు ఆర్థికాభివృద్ధిని సాధించాలి



ఇందిరా మహిళాశక్తి అవగాహన కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ అశోక్‌గౌడ్ తదితరులు

**నర్సాపూర్ అక్టోబరు 24. ప్రభాతవార్త:** ప్రభుత్వం మహిళలకు అందిస్తున్న వివిధ పథకాలను సద్వినియోగం చేసుకొని ఆర్థికాభివృద్ధిని సాధించాలని నర్సాపూర్ మున్సిపల్ చైర్మన్ అశోక్‌గౌడ్ అన్నారు. గురువారం నర్సాపూర్‌లోని మున్సిపల్ కార్యాలయంలో మెప్మా ఆధ్వర్యంలో ఇందిరా మహిళాశక్తిపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా మున్సిపల్ చైర్మన్ అశోక్‌గౌడ్ పాల్గొనగా, మెప్మా పిడి ఇందిరా, నర్సాపూర్ మెప్మా అధికారి దేవపాల, మున్సిపల్ కమీషనర్ రామకృష్ణారావు, మెప్మా రిసోర్స్ పర్సన్ రాజీవ, మేనేజర్ మధుసూదన్ తదితదరులుపాల్గొన్నారు. ఈ సందర్భంగా మెప్మా ఆర్‌సిలకు అవగాహన కల్పించడం జరిగింది, ఈ సందర్భంగా మున్సిపల్ చైర్మన్ అశోక్‌గౌడ్ మాట్లాడుతూ ప్రభుత్వం మహిళాశక్తి ద్వారా పలు యూనిట్లను అందజేస్తుందన్నారు. ఈ యూనిట్లను ప్రతి ఒక్క మహిళ సద్వినియోగం చేసుకొని అభివృద్ధి చెందాలన్నారు. అనంతరం మెప్మా పిడి ఇందిర మాట్లాడుతూ కోటి మహిళలను కోటీశ్వరులుగా చేయడమే ప్రభుత్వలక్ష్యమన్నారు. ఈ మేరకు మహిళాశక్తి కింద ఫుడ్‌ప్రాసెసింగ్ యూనిట్లను మంజూరు చేసిందన్నారు. ఈ సందర్భంగా నర్సాపూర్ మున్సిపాలిటీ పరిధిలో 16 యూనిట్లు మంజూరు కాగా, 10 యూనిట్లు ప్రారంభమయినట్లు తెలిపారు. కాగా ప్రభుత్వం మొత్తం జిల్లాకు 68 సంఘాలకు సుమారు రూ.8కోట్లు మంజూరు చేసిందని తెలిపారు. ఈ మేరకు ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్లు ధాన్యం, కూరగాయలు, మొక్కజొన్నలు వంటి ఆహారపదార్థాలు మాత్రమే ఈ యూనిట్లలో ఉండాలన్నారు. ఇందులో ఒక్కో యూనిట్‌కు సుమారు రూ.3లక్షల 50వేల రుణం లభిస్తుందని తెలిపారు. ఈ రుణాల్లో 35 శాతం ప్రభుత్వం సబ్సీడీ ఇస్తుండగా 15 శాతం లబ్దిదారుడు భరించాలని, మిగతా 50 శాతం బ్యాంక్ ద్వారా రుణం ఇవ్వడం జరుగుతుందన్నారు. అనంతరం మున్సిపల్ కమీషనర్ రామకృష్ణారావు మాట్లాడుతూ, ఇందిరాశక్తి పథకం ద్వారా యూనిట్లను మహిళలందరు దరఖాస్తులు చేసుకోవాలన్నారు. ఈ మేరకు యూనిట్లను ఎంచుకొని మంచిగా నడిపించి, అభివృద్ధి చెందాలన్నారు. రుణాల రికవరీ క్రమం తప్పకుండా చేయాలని తెలిపారు. తర్వాత రిసోర్స్ పర్సన్ రాజీవ మాట్లాడుతూ మహిళాశక్తి పథకంలో మహిళలు ఏ విధంగా యూనిట్లను ఎంచుకోవాలో, ఎటువంటి యూనిట్లను పెట్టుకోవాలో తెలియజేశారు. ఈ మేరకు పథకం వివరాలను విధివిధానాలను క్లుప్తంగా వివరించారు. ఈ కార్యక్రమంలో మెప్మా అధికారులు, ఆర్‌సిలు తదితరులు పాల్గొన్నారు.

## రైతుల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం



తుర్కపల్లిలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే సంజీవరెడ్డి

**నారాయణఖేడ్ టౌన్, అక్టోబరు 24, ప్రభాతవార్త:** మండల పరిధిలోని తుర్కపల్లిలో ఇందిరా క్రాంతిపథకం ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన వరి కొనుగోలు కేంద్రాన్ని గురువారం ఎమ్మెల్యే డాక్టర్ పట్లోళ్ల సంజీవరెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే సంజీవరెడ్డి మాట్లాడుతూ, రైతుల సంక్షేమమే లక్ష్యంగా కాంగ్రెస్ ప్రభుత్వం పాలన సాగిస్తోందన్నారు. రైతులు సాగుచేసిన ప్రతి గింజను గిట్టుబాటు ధరకు ప్రభుత్వం కొనుగోలు చేస్తుందన్నారు. కార్యక్రమంలో సొసైటీ చైర్మన్, ఐకెపి అధికారులు, నాయకులు అశోక్‌రెడ్డి, రమేష్ చౌహాన్, పండరిరెడ్డి, ఈశ్వరప్ప, శంకర్ ముదిరాజ్, దత్తుగౌడ్, నరసింహారెడ్డి, నెహ్రూ నాయక్, జ్ఞానేశ్వర్‌రెడ్డి, రాజు నాయక్, శివకుమార్, వెంకన్న సాగర్ తదితరులు పాల్గొన్నారు.

## తొగుట పీఠాధిపతిని దర్శించుకున్న మాజీ ఎమ్మెల్యే



తొగుట పీఠాధిపతిని దర్శించుకుంటున్న మాజీ ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి

**నారాయణఖేడ్ టౌన్, అక్టోబరు 24, ప్రభాతవార్త:** పట్టణంలోని శ్రీరమా సహిత సత్యనారాయణస్వామివారి ఆలయాన్ని గురువారం తొగుట పీఠాధిపతి శ్రీశ్రీశ్రీ మాధవానందస్వామి దర్శించుకున్నారు. ఆలయానికి మాధవానంద సరస్వతి స్వామివారు వచ్చినట్లు తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే మహారెడ్డి భూపాల్‌రెడ్డి ఆలయానికి చేరుకుని ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించి స్వామివారి ఆశీస్సులు అందుకున్నారు. కార్య క్రమంలో మాజీ జడ్పీటిసి సభ్యులు రవీందర్ నాయక్, పట్టణ బిఆర్ఎస్ అధ్యక్షులు నగేష్ సేట్, టిఆర్ఎస్వీ నియోజకవర్గ అధ్యక్షులు అంజాగౌడ్, మాజీ సర్పంచ్ సంగప్ప, శ్రీనివాస్, నాయకులు, ఆలయ కమిటి బాధ్యులు ఉన్నారు.

## ఉపాధ్యాయులు సమయ పాలన పాటించాలి



**నర్సాపూర్ అక్టోబర్ 24. ప్రభాతవార్త:** ఉపాధ్యాయులు సమయ పాలన పాటించాలని ఈ మేరకు సమయ పాలన పాటించకపోతే చర్యలు తప్పవని మండల విద్యాధికారి తారాసింగ్ అన్నారు. గురువారం నర్సాపూర్ పట్టణంలోని ఎంఈఓ కార్యాలయంలో విలేకరుల సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులకు అర్థమయ్యే రీతిలో విద్యాబోధన చేయాలన్నారు. నర్సాపూర్ మండలవ్యాప్తంగా కొత్తగా 7 మంది ఉపాధ్యాయులు రాగా మండలంలోని అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో ఉపాధ్యాయ సీట్లు భర్తీ అయినట్లు తెలిపారు. ప్రైవేటు, ప్రభుత్వ పాఠశాలల్లో ఏవైనా సమస్యలు తమదృష్టికి తెస్తే, వాటి పరిష్కారానికి కృషి చేస్తానని అన్నారు. అలాగే ప్రతి పాఠశాలను నిరంతరం సందర్శిస్తామని అన్నారు. ఈమేరకు రాబోయే పదవ తరగతి పరీక్షల్లో విద్యార్థులు మంచి ఫలితాలు సాధించేందుకు ఉపాధ్యాయులు కృషి చేయాలన్నారు. అలాగే విద్యార్థులు క్రమశిక్షణతో మంచిగా విద్యను అభ్యసించాలని ఎంఈఓ తారాసింగ్ సూచించారు. ఈ కార్యక్రమంలో సిఆర్‌పి భైరవరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఎంఈఓ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న ఎంఈఓ తారాసింగ్

## మెదక్‌కు మెడికల్ కళాశాల మంజూరు



విలేకరులతో మాట్లాడుతున్న మున్సిపల్ మాజీ చైర్మన్ ఆరెళ్ల మల్లికార్జున్ గౌడ్

కళాశాల మంజూరు కావటానికి తప్పకుండా మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ పట్టుదల, ప్రత్యేక చొరవ అని చెప్పకతప్పదని మెదక్ మున్సిపల్ మాజీ చైర్మన్ ఆరెళ్ల మల్లికార్జున్ గౌడ్ తెలిపారు. గురువారం వారు విలేకరులతో మాట్లాడుతూ మెదక్ పట్టణంలోని పిల్లికొట్యాల్‌లో మెడికల్ కళాశాల ప్రారంభోత్సవ కార్యక్రమం శుభసూచకం, చరిత్రాత్మకమని అన్నారు. గత మా కెసిఆర్ ప్రభుత్వం ఇచ్చిన జీవో ప్రకారం, 18ఎకరాల స్థలాన్ని పిల్లికొట్యాల్ మాతాశిశు సంరక్షణకేంద్రం వెనకాల కేటాయించి అప్పటి ఆరోగ్యశాఖామంత్రి తన్నీరు హరీష్‌రావు చేతులమీదుగా భూమిపూజ జరిగిందన్నారు. అలాగే వందసీట్లతో 2023-24 విద్యాసంవత్సరం ప్రారంభించాలని ఏర్పాటుచేశారు. నేడు ప్రారంభించిన మెడికల్ కళాశాల 50 సీట్ల నుండి 100కు పెంచాలని, దీనితోపాటు నర్సింగ్ కళాశాల, పారా మెడికల్‌ను అనుసంధానంగా ఏర్పాటుచేయవలసిందిగా ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నామన్నారు. ఈ మెడికల్ కళాశాల కోసం మాజీ మంత్రులు తన్నీరు హరీష్‌రావు, మాజీ శాసనసభ్యులు పద్మాదేవేందర్‌రెడ్డి ఎనలేని కృషిచేసి మెదక్ ప్రజల చిరకాల కోరికను నేడు సాకారం చేశారని, కేసీఆర్ మదిలో నుంచి పుట్టిన సంకల్పం రాష్ట్రంలో, జిల్లాల్లో మెడికల్ కళాశాల ఏర్పాటు కేవలం కేసీఆర్ ముందుచూపు ఫలితం అనే చెప్పుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ ఆకిరెడ్డి కృష్ణారెడ్డి, పట్టణ కౌన్సిల్ సభ్యులు భీమరి కిషోర్, ఆర్‌కె. శ్రీనివాస్, సులోచన ప్రభురెడ్డి, వంజరి జయరాజు, యువ నాయకులు శ్రీను నాయక్, రంజిత్ నాయక్, లడ్డు, భువనచంద్ర, దశరథ్ తదితరులు పాల్గొన్నారు.

## పాత్రికేయులకు వర్క్‌షాప్

**రామాయంపేట, అక్టోబర్ 24, ప్రభాతవార్త:** మెదక్ పట్టణంలోని సమీకృత కలెక్టరేట్ కార్యాలయంలో శుక్రవారం జర్నలిస్టులకు వర్క్‌షాప్ నిర్వహించనున్నట్లు ప్రెస్ ఇన్ఫర్మేషన్ డిప్యూటీ డైరెక్టర్ మానస్‌కృష్ణకాంత్ తెలిపారు. మెదక్ జిల్లా పాత్రికేయులకు ప్రెస్ ఇన్ఫర్మేషన్ బ్యూరో ఆహ్వానం పలుకుతుందన్నారు. మెదక్ పట్టణంలోని సమీకృత కలెక్టరేట్ కార్యాలయంలో ఈనెల 25వ తేదీ శుక్రవారం ఉదయం 10.15 గంటలకు హైదరాబాద్ ప్రెస్ ఇన్ఫర్మేషన్ బ్యూరో జర్నలిస్టుల కోసం మీడియా వర్క్‌షాప్ నిర్వహిస్తోందని తెలిపారు. ముఖ్య అతిథులుగా మెదక్ పార్లమెంట్ సభ్యులు రఘునందన్‌రావు, జిల్లాకలెక్టర్ రాహుల్‌రాజ్‌లు హాజరు అవుతున్నారని, జిల్లాలోని ప్రింట్, ఎలక్ట్రానిక్‌మీడియా హాజరు కావాలన్నారు.